RNI NO. TELTEL/2022/83470

manasakshi.in

# మనసాక్షి


మీకోసం

తెలుగు దినపత్రిక

ఎడిటర్ : మల్లె నాగిరెడ్డి


## శ్రీవారికి పట్టువస్త్రాలు

### సమర్పించిన సీఎం జగన్



**తిరుమల:** తిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవాలసందర్భంగా స్వామివారికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున సీఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డి పట్టువస్త్రాలు సమర్పించారు. తొలుత సిఎంజగన్ తాతయ్య గుంట గంగమ్మ ఆలయాన్ని దర్శించుకుని తిరుమలకు చేరుకున్నారు. తిరుమలలో వకుళా మాత, రచన అతిథి గృహాలు ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వం తరపున శ్రీవారికి పట్టువస్త్రాలను సీఎం సమర్పించారు.

నల్గొండ | హైదరాబాద్ | సంపుటి : 1. సంచిక : 341 | బుధవారం 20 సెప్టెంబర్ 2023 | పేజీలు 8 | వెల: రూ. 1.00 | epaper.manasakshi.in



# కేసీఆర్ సర్కారుకు ఇంకా 99 రోజులే..

## విచక్షణ కోల్పోయి మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేతలు

## పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి విమర్శలు

**హైదరాబాద్:** సోనియాగాంధీ తెలంగాణకు రావడంతో.. బీజేపీ, బీఆర్?ఎస్?, మజ్లిస్ ముసుగులు తొలగిపోయాయని.. ఈ మూడు పార్టీలు ఒక్కటేనని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కేసీఆర్ సర్కారుకు రోజులు దగ్గరపడ్డాయని.. ఇంకా 99 రోజులే మిగిలి ఉన్నాయన్నారు. విజయ భేరి సభలో ప్రకటించిన ఆరు గ్యారెంటీలను.. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో అమలు చేసి తీరుతామని స్పష్టం చేశారు. హైదరాబాద్?లో సీడబ్ల్యూసీ సమావేశాలు , విజయభేరి సభ, కాంగ్రెస్ అభయహస్తం గ్యారెంటీ కార్డులను ప్రజలకు చేరవేసే కార్యక్రమాలు.. ఈ మూడు రోజుల్లో జరిగాయని రేవంత్ వివరించారు. ఈ కార్యక్రమాలను పూర్తిస్థాయిలో విజయవంతం చేసిన సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఏఐసీసీ నేతలకు, రాష్ట్రస్థాయి నాయకులు, కాంగ్రెస్ శ్రేణులకు ధన్యవాదాలు

మిగతా 2లో



2లో


## తెలంగాణకు

### మూటలు ఎలాగూ ఇవ్వరు..

కనీసం మర్యాదైనా చూపండి

తెలంగాణపై పదే పదే అక్కసు ఎందుకు?

మోదీ వ్యాఖ్యలపై కేటీఆర్ మండిపాటు





## భూమికి గుడ్‌బై...

### సూర్యుని దిశగా ఆదిత్య-ఎల్1ప్రయాణం ప్రారంభం

**బెంగళూరు:** సూర్యుడి రహస్యాలను శోధించేందుకు భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో చేపట్టిన మిషన్ ఆదిత్య-ఎల్1 ప్రయోగంలో మరో కీలక ఘట్టం చోటుచేసుకుంది. భూమికి గుడ్‌బై చెప్పిన ఆదిత్య-ఎల్1 సూర్యుని దిశగా ప్రయాణం ప్రారంభించింది. ఆదిత్య-ఎల్1 ఉపగ్రహ కక్ష్యను పెంచి ఆదిత్యుని దిశగా ట్రాన్స్ లగ్రేంజియన్ పాయింట్-1 దిశలో విజయవంతంగా ప్రవేశపెట్టినట్లు ఎక్స్ (ట్విట్టర్)లో ఇస్రో పోస్ట్ చేసింది. భూమికి సుమారు 15 లక్షల కిలోమీటర్ల దూరంలో ఉన్న ట్రాన్స్-లగ్రేంజియన్ పాయింట్‌లో ప్రవేశపెట్టినట్లు తెలిపింది ఆ పోస్ట్‌లో పేర్కొంది.

## లోయలో పడ్డ బస్సు..

# 24 మంది మృతి

**పెరూ:** దక్షిణ అమెరికా దేశం పెరూలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ప్రయాణికులతో వెళుతున్న ఓ బస్సు కొండపై నుంచి లోయలోకి దూసుకెళ్లిన ఘటనలో సుమారు 24 మంది చనిపోగా 35 మంది గాయపడ్డారు. ఆండీస్ పర్వతాల మీదుగా హుయాన్యాయో నుంచి హువాంటా వెళ్తుతుండగా అదుపు తప్పి 200 మీటర్ల లోతులో ఉన్నలో లోయలో పడింది. మృతుల్లో ఇద్దరు చిన్నారులు ఉన్నారు. ప్రమాదం జరిగిన సమాచారం అందిన వెంటనే పోలీసు, ఆరోగ్య శాఖ సిబ్బంది ఘటనాస్థలికి వెళ్లి సహాయ చర్యలు చేపట్టారు. ఇదే ప్రాంతంలో గత నెల బస్సు ప్రమాదం జరిగి 13 మంది చనిపోయారు. పెరూలో సరైన రోడ్డు సదుపాయాలు లేక ప్రమాదాలు జరగడం సర్వసాధారణమైంది. ఇక్కడ రాత్రిపూట, పర్వతాల్లో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా చోటుచేసుకుంటున్నట్లు నివేదికలు తెలుపుతున్నాయి.

## ఇది దేశంలోని

### ప్రతి ఒక్క మహిళ విజయం



**మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టబోవడంపై హర్షం**

**ఎలాంటి అడ్డంకి లేకుండా లోక్‌సభలో సాఫీగా ఆమోదం పొందాలని ఆకాంక్ష**

**ఇది దేశ ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందన్న కవిత**

హైదరాబాద్,:అధికారంలో సగం కావాలన్న మహిళల కల సాకారం కాబోతున్నదని ఎమ్మెల్సీ కవిత అన్నారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వెనుక బీఆర్ఎస్ కృషి ఉందన్నారు. మహిళా బిల్లకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని సామాజిక మాధ్యమం ఎక్స్ (ట్విట్టర్) వేదికగా వెల్లడించారు. మహిళా రిజర్వేషన్‌కు సంబంధించి కేంద్ర కేబినెట్ ఒక మంచి నిర్ణయం తీసుకుందన్నారు. కేంద్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాన్ని సాగతిస్తున్నామని చెప్పారు. అధికారంలో సగం కావాలన్న మహిళ కల సాకారం కాబోతున్నదని, ఇది దేశంలోని ప్రతిఒక్క మహిళ విజయమన్నారు. దేశ పౌరులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. 2014లో బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే అసెంబ్లీలో 33 శాతం మహిళా రిజర్వేషన్, ఓబీసీ రిజర్వేషన్లను ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపిందన్నారు. తొమ్మిదేండ్ల జాప్యం తర్వాత మహిళా రిజర్వేషన్ బిల్లుపై కేంద్రం నిర్ణయం తీసుకుందని చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పటికే ఓబీసీ, మహిళా రిజర్వేషన్లపై ప్రధాని మోదీకి లేఖలు రాశారని గుర్తుచేశారు. లోక్‌సభలో అధికార పార్టీకి పూర్తిస్థాయి మెజారిటీ ఉండటంతో ఎలాంటి అడ్డంకులు లేకుండా ఈ బిల్లును ఆమోదించేలా చూడాలని ఎమ్మెల్సీ కవిత అన్నారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లుకు

# కేంద్ర కేబినెట్ ఆమోదం!

**లోక్ సభ, రాష్ట్రాల అసెంబ్లీలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్**

**ఈ బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపినట్లుగా జాతీయ మీడియాలో వార్తలు**

**వన్ నేషన్ వన్ ఎలక్షన్, దేశం పేరు మార్పుపై కూడా కేబినెట్ నిర్ణయం తీసుకుందా? అనే ప్రశ్నలు**

న్యూఢిల్లీ:ఎట్టకేలకు మహిళా బిల్లుకు మోక్షం కలగబోతోంది. ఈ క్రమంలో అధికార విపక్షాలు ముక్తకంఠంతో ముందుగా దీనిని గట్టెక్కించి..మహిళల పట్ల తమ చిత్తశుద్ధిని చాటుకోవాలి. పార్లమెంటులో ఎలాంటి శషభిషలకు పోకుండా ముందుకు సాగాలి. మహిళలకు మద్దతుగా అందరూ ఏకగ్రీవంగా బిల్లును ఆమోదించి మన హిళలకు గౌరవం దక్కేలా చేయాలి. అంతేగాకుండా డి లిమిటేషన్‌తో సంబంధం లేకుండా వెంటనే అమల్లోకి వచ్చేలా చేయాలి. రానున్న ఎన్నికల నుంచే రిజర్వేషన్లు అమలయ్యేలా చట్టంలో మార్పులు చేయాలి. దీనికి డీ లిమిటేషన్ లింకు తొలగించేలా విపక్షాలు పోరాడాలి. రానున్న అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల నుంచే మహిళా రిజర్వేషన్లు అమలు అయ్యేలా మార్పులతో చట్టాన్ని ఆమోదించి మోడీ ప్రభుత్వం చిత్తశుద్ధి చాటాలి. విపక్షాలు కూడా దీనిపై పోరాడాలి. చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిన తరవాత ..మహిళా రిజర్వేషన్ బిల్లు మంగళవారం లోక్‌సభ ముందుకొచ్చింది. ఈ రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ నేడు దిగువ సభలో ప్రవేశపెట్టారు. నారీ శక్తి వందన్ అభియాన్ పేరుతో ఈ బిల్లును కేంద్రం తీసుకొచ్చింది. ఇది ఎంతో పవిత్ర కార్యక్రమంగా భావించాలి.



బుధవారం నుంచి లోక్‌సభలో దీనిపై చర్చ జరగనుంది. ఆ తర్వాత ఓటింగ్ నిర్వహించి బిల్లుకు ఆమోదం తెలపనున్నారు. ఈ నేపథ్యంలో దాదాపు 27 ఏళ్ల తర్వాత మోదీ సర్కార్.. మహిళా రిజర్వేషన్లపై కొత్త బిల్లును తీసుకురావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇక, రాజ్యసభలో ఈ బిల్లును సెప్టెంబరు 21వ తేదీన ప్రవేశపెట్టనున్నారు. కాగా.. కొత్త పార్లమెంట్ భవనంలో ప్రవేశపెట్టిన తొలి బిల్లు ఇదే కావడం విశేషం. తాజా బిల్లు 2010లో రాజ్యసభలో ఆమోదం పొందిన బిల్లు వేర్వేరు కావడం వల్ల గతంలోకి పోకుండా తాజాగా దీనిపై చర్చకు సహకరించాలి. కొత్తదానికి పాతది ఒకటే కాదని కేంద్ర ప్రభుత్వ వర్గాలు

మిగతా 2లో



2లో

## నకిలీ సర్టిఫికెట్ల ముఠా అరెస్ట్

### వివరాలు వెల్లడించిన సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర



## కాంగ్రెస్ అధికారాన్ని ప్రజలు కోరుకుంటున్నారు

2లో

## చంద్రబాబు అరెస్ట్‌పై టిడిపి నిరసనలు

**అమరావతి:** తెదేపా అధినేత చంద్రబాబు అరెస్టుకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా రోడ్డెక్కుతున్న వారిపై పోలీసులు ఆంక్షలు విధిస్తున్నారు. నిరసన కార్యక్రమాల్లో భాగంగా ప్రత్యేక పూజలు, పాదయాత్రలు, ర్యాలీలు నిర్వహించాలని తెదేపా నిర్ణయించింది. మంగళవారం ఆయా నిరసన కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళ్తున్న వారిని పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నేతలను గృహనిర్బంధం చేశారు. పోలీసుల వైఖరిపై తెదేపా నేతలు మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా తెదేపా నేతల గృహ నిర్బంధాలను తెదేపా ఏపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఖండించారు. సైకో రెడ్డి పాలనలో దేవుడిని చూసే భాగ్యం కూడా లేదా అని ప్రశ్నించారు. జగన్ రెడ్డీ.. అరచేతిని అడ్డుపెట్టి సూర్యుడిని ఆపలేవని గుర్తుంచుకో అని అచ్చెన్న వ్యాఖ్యానించారు. జీవితమంతా ప్రజాసేవకే అంకితం చేసిన చంద్రబాబుపై జగన్ అక్రమ కేసులు బనాయించి జైల్లో పెట్టించారని మండిపడ్డారు. చంద్రబాబు నిర్దోషిగా బయటకు రావాలని భగవంతుడిని ప్రార్థించేందుకు ఆలయాలకు వెళ్తున్న తెదేపా నేతలను పోలీసులు అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. వారు ఏం తప్పు చేశారని గృహ నిర్బంధాలు చేస్తున్నారని అచ్చెన్నాయుడు నిలదీశారు. 'దేవుడికి బాధలు చెప్పే స్వేచ్ఛ కూడా జగన్ పాలనలో లేదనడానికి ఇంతకంటే నిదర్శనం ఏం కావాలన్నారు. చంద్రబాబు అరెస్ట్ జరిగినప్పటి నుంచి తెదేపా నేతలను గృహనిర్బంధం చేస్తూనే ఉన్నారు. మీ అరాచకాలు బయటపడతాయని భయమా? మా వాళ్లు చేసిన తప్పేంటి? ఎక్కడైనా విధ్వంసాలకు, చట్ట వ్యతిరేక కార్యాకలాపాలకు పాల్పడ్డారా? పోలీసులు చట్టాలను అతిక్రమించి వ్యవహరిస్తున్నారు. హద్దులు దాటి అణచివేతకు గురి చేస్తున్నారు. చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చేసి పైశాచికానందం పొందుతున్న వైకాపా నేతల మాటల్ని పోలీసులు వినొద్దు. చంద్రబాబు కోసం అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా రోడ్లపైకి వస్తుంటే వారిని అడ్డుకోవడం దేనికి సంకేతం? ఎన్నికలు దగ్గర పడుతున్నా.. రాజారెడ్డి రాజ్యాంగాన్నే అమలు చేస్తామంటే చూస్తూ ఊరుకోం' అని అచ్చెన్న అన్నారు. గుంటూరులో ర్యాలీ నిర్వహించి పూజలు చేయాలని తెదేపా నేతలు ఏర్పాట్లు చేశారు. అయితే నిరసనలకు అనుమతి లేదంటూ పోలీసులు అడ్డుకుంటున్నారు. శారదా కాలనీ ఆర్చ్ సెంటర్ నుంచి నాజ్ సెంటర్‌కు వెళ్లే దారిలో భారీగా బలగాలు మోహరించారు. బారికేడ్లు ఏర్పాటు చేశారు. రోడ్డుపైకి వస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తెదేపా నేతలు నక్కా ఆనంద్‌బాబు, దేగల ప్రభాకర్, నన్నపనేని రాజకుమారి, జీవీ ఆంజనేయులును గృహనిర్బంధం చేశారు. ప్రజాస్వామ్య హక్కులను హరిస్తున్నారని తెదేపా నేతలు మండిపడ్డారు. చంద్రబాబుకు బెయిల్ రావాలని ప్రార్థించే హక్కు కూడా లేదా అని నిలదీశారు. ఎన్ని ఆంక్షలు విధించినా ర్యాలీకి వెళ్లి తీరుతామని స్పష్టం చేశారు. చంద్రబాబు అరెస్ట్‌ను నిరసిస్తూ వైఎస్ఆర్ జిల్లా ఒంటిమిట్టలో పాదయాత్రకు సిద్ధమైన తెదేపా నేతలను పోలీసులు అడ్డుకున్నారు. ఒంటిమిట్ట మండలం

కొత్తమాధవరం నుంచి రామాలయం వరకు పాదయాత్రకు సిద్ధమవగా.. అనుమతి లేదంటూ కడప డీఎస్పీ షరీఫ్ అభ్యంతరం తెలిపారు. దీంతో కడప-రేణిగుంట రహదారిలో తెదేపా నాయకులను పోలీసులు అడ్డుకున్నారు.చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ విశాఖ జిల్లా సింహాచలంలో పూజలు చేసేందుకు వెళ్తున్న తెదేపా నేతలను పోలీసులు అడ్డుకున్నారు. కొండపైకి వెళ్లేందుకు అనుమతి లేదంటూ కిందనే నేతలను అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. చంద్రబాబు క్షేమంగా జైలు నుంచి విడుదల కావాలంటూ సింహాద్రి అప్పన్నకు మొక్కుకునేందుకు వెళ్తే ఆంక్షలు ఏంటని మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్నా చేయటానికి రాలేదని.. దర్శనానికి వస్తే అడ్డగింతలు ఏంటని నిలదీశారు. కొండపై 144 సెక్షన్ ఉందా? అంటూ పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం బండారు సత్యనారాయణ మూర్తి, పాడేరు మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరితో పాటు ఇతర నేతలను బలవంతంగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. శ్రీకాకుళం ఏడురోడ్ల కూడలి నుంచి అరసవల్లి వరకు పాదయాత్రకు తెదేపా నేతలు పిలుపునిచ్చారు. ఈనేపథ్యంలో తెదేపా కార్యకర్తలను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్, కూన రవికుమార్, మాజీ ఎమ్మెల్యేలను గృహనిర్బంధం చేశారు. నందిగామలో మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యను కూడా హౌస్ అరెస్ట్ చేశారు.

అన్నవరం సత్యదేవుని సన్నిధికి తెదేపా శ్రేణుల పాదయాత్రగా వెళ్లారు. మెట్టుమెట్టుకు హారతివెలిగిస్తూ నేతలు, కార్యకర్తలు కొండపైకి చేరుకున్నారు. చంద్రబాబు త్వరగా విడుదల కావాలని.. ఆయన ఆరోగ్యంగా ఉండాలని పూజలు చేశారు. తెదేపా నాయకులు జ్యోతుల నెహ్రూ, జ్యోతుల నవీన్, వనమాడి కొండబాబు, చిక్కాల రామచంద్రరావు, వరుపుల సత్యప్రభ, యనమల కృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్ట్‌పై చెన్నైలో మహిళలు, ఐటీ ఉద్యోగులు నిరసనకు దిగారు. ఆయన అరెస్ట్ అక్రమమని.. వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల్లో ఉండాల్సిన నాయకుడిని జైల్లో పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. చంద్రబాబు అరెస్ట్‌ను నిరసిస్తూ తెలంగాణలోని సంగారెడ్డిలో తెదేపా బైక్ ర్యాలీ నిర్వహించింది. జడ్పీ మాజీ ఛైర్మన్ శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. తెదేపా కార్యకర్తలు నల్ల టీషర్టులు ధరించి ర్యాలీలో పాల్గొన్నారు. చంద్రబాబు క్షేమం కోరుతూ కూకట్‌పల్లిలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో సుదర్శన హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నందమూరి సుహాసిని పాల్గొన్నారు.

# మహిళా రిజర్వేషన్ బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం!



వెల్లడించాయి. మహిళా రిజర్వేషన్ల అంశంపై కేంద్రం కొత్తగా మరో రాజ్యాంగ సవరణ బిల్లును తీసుకొస్తున్నట్లు తెలిపాయి. అందువల్ల తాజా బిల్లు ఉభయ సభల్లో ఆమోదం పొందాల్సి ఉంటుందని పేర్కొన్నాయి. వాస్తవానికి మహిళా రిజర్వేషన్ బిల్లును 1996లో హెచ్‌డీ దేవెగౌడ సారథ్యంలోని యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం తొలుత లోక్‌సభలో ప్రవేశపెట్టింది. తర్వాత వాజ్‌పేయీ, మన్మోహన్ సింగ్ ప్రభుత్వాల హయాంలోనూ ప్రవేశపెట్టినప్పటికీ ఈ బిల్లు సభ ఆమోదానికి నోచుకోలేదు. చివరకు ఈ బిల్లు 2010లో రాజ్యసభ ఆమోదం పొందినా లోక్‌సభలో మాత్రం పెండింగులోనే ఉండిపోయింది. 2014లో ఆ లోక్‌సభ రద్దు కావడంతో అక్కడ బిల్లు మురిగిపోయింది.

ఈ బిల్లు చట్టంగా మారితే.. లోక్‌సభ, రాష్ట్రాల శాసన సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలవుతాయి. అయితే, ఈ బిల్లు ఉభయ సభల్లో ఆమోదం పొందినప్పటికీ.. 2027 తర్వాత రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయని కేంద్రం చెబుతోంది. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత రొటేషన్ పక్రియలో రిజర్వు సీట్ల కేటాయింపు ఉంటుందని పేర్కొంది. దీని స్వరూపం ఎలా ఉన్నా లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభల్లో 33 శాతం సీట్లను మహిళలకు కేటాయించేందుకు ఉద్దేశించిన మహిళా రిజర్వేషన్ బిల్లు గట్టెక్కడం ముఖ్యం. దాదాపు మూడు దశాబ్దాలుగా ఎదురుచూస్తోన్న బిల్లుకు.. విపక్షపార్టీలు కూడా మద్దతు ప్రకటిస్తుండటంతో చట్టరూపం దాల్చడం ఖాయంగా కనిపిస్తోంది. అయితే, ప్రస్తుతం ఉభయసభల ఆమోదం పొందినప్పటికీ.. 2027 తర్వాతే ఇవి అమల్లోకి వస్తాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో లోక్‌సభతోపాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీల్లో మూడోవంతు సీట్లు మహిళలకు కేటాయించనున్నారు. దిల్లీ అసెంబ్లీకీ కూడా ఇది వర్తిస్తుంది. విధాన నిర్ణయాల్లో మహిళా భాగస్వామ్యం పెంచడమే లక్ష్యంగా

తీసుకువచ్చిన ఈ బిల్లు చట్టరూపం దాల్చితే.. చట్టసభల్లో 15 ఏళ్లపాటు మహిళకు రిజర్వేషన్లు అమల్లో ఉంటాయి. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత రొటేషన్ పక్రియలో రిజర్వు సీట్ల కేటాయింపు ఉంటుంది. మహిళా రిజర్వేషన్ల కోసం రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్రం ప్రవేశపెట్టనున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. మహిళలకు ఈ 33శాతం రిజర్వేషన్లు అమల్లోకి వచ్చిన తర్వాత 15ఏళ్ల పాటు అమల్లో ఉండనున్నాయి. తదుపరి వీటిని పెంచుకునే అవకాశం ఉంది. ఈ కోటాలోనే ఎస్సీ, ఎస్టీ మహిళలకు మూడోవంతు సీట్లను కేటాయిస్తారు. ఓబీసీ రిజర్వేషన్ల అంశాన్ని ఈ బిల్లులో పొందుపరచలేదు. కాగా.. ఈ మహిళా రిజర్వేషన్లు రాజ్యసభ, శాసన మండళ్లకు వర్తించవు. ఈ బిల్లు చట్టరూపం దాల్చిన అనంతరం చేపట్టే నియోజక వర్గాల పునర్విభజన పక్రియ పూర్తయిన తర్వాతే ఇది అమల్లోకి వస్తుంది. డీలిమిటేషన్ పక్రియ చేపట్టాలంటే జనగణన జరగాలి. 2021లోనే జనగణన జరగాల్సి ఉన్నప్పటికీ కొవిడ్ కారణంగా ఆ పక్రియ వాయిదా పడింది. ఈ నేపథ్యంలో 2027 డీలిమిటేషన్ పక్రియ తర్వాతే ఈ రిజర్వేషన్లు అమల్లోకి రానున్నాయి. ఈ క్రమంలో దీనితో ముడిపడివున్న అనేక అడ్డంకులను తొలగించుకుంటే మంచిది. ఇక్కడా ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలి. జనగణనతో పాటు డి లిమిటేషన్ ప్రక్రియతో సంబంధం లేకుండా వచ్చే లోక్‌సభ ఎన్నికల నుంచి దీనిని అమలు చేస్తే మంచింది. 'ఈ బిల్లు ఎంపీలకు అగ్నిపరీక్షే' అని మోదీ అభివర్ణించినట్లు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇదిలా ఉండగా.. జనగణన, నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియలు పూర్తయిన తర్వాత 2027 నాటికి చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లను పూర్తి స్థాయిలో అమల్లోకి తీసుకురావాలని కేంద్రం భావిస్తున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి.

# నకిలీ సర్టిఫికెట్ల ముఠా అరెస్ట్

**వివరాలు వెల్లడించిన సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర**

**శేరిలింగంపల్లి (19సెప్టెంబర్ ) మన సాక్షి**



నకిలీ సర్టిఫికెట్లు, స్టాంప్స్ తయారు చేస్తూ మోసాలకు పాల్పడుతున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. కేటుగాళ్లు అధికారుల సంతకాలు ఫోర్జరీ చేసి జీహెచ్ఎంసీ, రెవెన్యూ, హెచ్ఎండీఏ శాఖలను బురిడీ కొట్టించారు. బ్యాంకుల నుండి లోన్లు తీసుకుని మోసాలకు పాల్పడుతున్నారు. ఇక ఈ ముఠాను సైబరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర మంగళవారం మీడియాకు వెల్లడించారు.కూకట్‌పల్లి, బాలానగర్, కేపీహెచ్‌బీ పోలీసు స్టేషన్ల పరిధిలో నకిలీ పత్రాలు సృష్టించి లోన్లు తీసుకుంటున్నట్లు పోలీసుల దృష్టికి వచ్చింది. దీనిపై ఎస్‌ఓటీ బాలానగర్, కేపీహెచ్‌బీ, కూకట్‌పల్లి పోలీసులు గత రెండు నెలలుగా లోతుగా దర్యాప్తు చేపట్టారు. సుధాకర్, రంగారావు, చంద్రశేఖర్ రావు, సీతారాం అనే కీలకంగా వ్యవహరిస్తూ ఈ ముఠాను నడుపుతున్నారు. వీరు జీహెచ్ఎంసీలో బిల్డింగ్ పర్మిషన్లకు సంబంధించిన పత్రాలు, రెవెన్యూలో ల్యాండ్ డాక్యుమెంట్లు, హెచ్ఎండీఏ పత్రాలు, బ్యాంక్ లోన్లకు అవసరమైన నకిలీ కాగితాలు ఇలా అనేక రకాల నకిలీ డాక్యుమెంట్లు తయారు చేస్తూ అవసరమైన వారికి వాటిని విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.వీరి వద్ద ఏ కార్యాలయానికి సంబంధించినవి కావాలంటే ఆ కార్యాలయం స్టాంప్‌లు, పత్రాలు, అధికారుల సంతకాలు కూడా ఫోర్జరీ చేస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడయింది. రంగారావు అనే వ్యక్తిపై గతంలోనూ ఈ తరహా కేసులు ఉన్నాయని సీపీ స్టీఫెన్ రవీంద్ర తెలిపారు. మరో నిందితుడు చంద్రశేఖర్, సీతారాం అనే మరో నిందితుడు కీలకంగా వ్యవహరిస్తున్నారు, అధికారుల సంతకాలు కూడా ఫోర్జరీ చేసి, నాగమల్లేశ్వర్ రావు అనే మరో వ్యక్తి ద్వారా ఈ తతంగం అంతా నడిపిస్తున్నారు. ఈ కేసులో ఇంకా దర్యాప్తు కొనసాగుతుంది. ఈ నకిలీ పత్రాలు, స్టాంప్స్ వ్యవహారంలో అడ్వకెట్స్, బ్యాంకు మేనేజర్ల పాత్ర కూడా ఉన్నట్లు దర్యాప్తులో గుర్తించామని, దీనిపై మరింత లోతుగా దర్యాప్తు కొనసాగిస్తున్నామన్నారు. బ్యాంక్‌ల నుండి బిజినెస్ లోన్ల కోసం తప్పుడు పత్రాలు సృష్టిస్తున్నారని, ఎస్ ఓటీ బాలానగర్, కూకట్ పల్లి, కేపీహెచ్‌బీ పోలీసులు గత రెండు నెలలుగా దర్యాప్తు చేసి కేసును ఛేదించారని అన్నారు. నకిలీ పత్రాలకు సంబంధించిన వ్యవహారంలో

ఇప్పటి వరకు ఇదే పెద్ద గ్యాంగ్ అని 8 ఏళ్ల నుండి ఇప్పటి వరకు వీరు అరెస్ట్ కాలేదని, ఈ ముఠాలో మొత్తం 18 మందిని అరెస్ట్ చేశామని తెలిపారు. వీరి వద్ద నుండి 687 ఫేక్ రబ్బర్ స్టాంప్స్, 1180 ఫేక్ సర్టిఫికెట్లు, 10 ల్యాప్ టాప్ లు, 8 సీపీయూలు, 8 మానిటర్లు, 2 ప్రింటర్లు, 1 స్టాంప్ మేకింగ్ మెషిన్, 1 స్టాంప్ ఫ్లాషర్, 57 మొబైల్ ఫోన్స్, 1 ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ రూ.10 కోట్ల వరకు ఉంటుందని సీపీ తెలిపారు.

## కేసీఆర్ సర్కారుకు ఇంకా 99 రోజులే..

తెలిపారు. 70 ఏళ్ల తరువాత హైదరాబాద్?లో సీడబ్ల్యూసీ సమావేశాలు జరిగాయని రేవంత్ పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షుడిగా తనకు గురుతర బాధ్యతను అప్పగించిన సోనియాగాంధీకి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను సోనియా గాంధీ ప్రకటించారని.. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ప్రతి నెలా రూ.2500, రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందించనున్నామని వివరించారు. రైతు భరోసా ద్వారా రైతులకు, కౌలు రైతులకు ఏడాదికి రూ.15000, వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12000 అందిస్తామన్నారు. గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించనున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఇంటి స్థలంతో పాటు.. ఇల్లు కట్టుకునేందుకు రూ.5 లక్షలు అందించనున్నామని స్పష్టం చేశారు. యువ వికాసం ద్వారా చదువుకునే విద్యార్థులకు రూ.5 లక్షల వరకు ఆర్థిక సాయం అందించనున్నామన్నారు. చేయూత పథకం ద్వారా రూ.4 వేలు పెన్షన్ ఇవ్వనున్నామని, రాజీవ్ ఆరోగ్య శ్రీ కింద రూ.10 లక్షల ఆరోగ్య బీమా అందించనున్నామన్నారు. వంద రోజుల్లో ఈ గ్యారెంటీలను అమలు చేస్తామని రాహుల్ హామీ ఇచ్చారన్నారు. తెలంగాణ తల్లి సోనియమ్మను స్వాగతించాల్సింది పోయి.. బీఆర్?ఎస్? నేతలు విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. బీఆర్?ఎస్? నేతలు రాజకీయ విచక్షణ కోల్పోయి మాట్లాడుతున్నారని విమర్శించారు. బహురూపు వేషాలతో సభను అడ్డుకోవాలని చూశారని రేవంత్ ఆరోపించారు. 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు, తెలంగాణ వచ్చాక కేసీఆర్ ఇచ్చిన హామీలపై చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. కేసీఆర్?కు ఏటీఎంగా మారిన ధరణిని రద్దు చేసి తీరుతామని రేవంత్?రెడ్డి పునరుద్ఘాటించారు.కేసీఆర్ దోపిడీ పాలనను బొంద పెట్టడం ధరణితోనే మొదలు పెడతామని స్పష్టం చేశారు. ధరణిని రద్దు చేసి అంతకంటే మెరుగైన విధానాన్ని తీసుకొస్తామని వెల్లడించారు "అభయహస్తం హామీలను వంద రోజుల్లో అమలు చేసి తీరుతాం. సోనియాగాంధీ తెలంగాణకు రావడంతో.. బీజేపీ, బీఆర్?ఎస్?, మజ్లిస్ ముసుగులు తొలగిపోయాయి. ఈ మూడు పార్టీలు ఒక్కటే. కేసీఆర్ సర్కారుకు రోజులు దగ్గరపడ్డాయి. 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు, తెలంగాణ వచ్చాక కేసీఆర్ ఇచ్చిన హామీలపై చర్చ పెట్టాలని అన్నారు.

# కాంగ్రెస్ అధికారాన్ని ప్రజలు కోరుకుంటున్నారు

## తమిళనాడు పిసిసి అధ్యక్షులు అలగిరి

**మల్కాజిగిరి, సెప్టెంబర్ 19, మనసాక్షి**



తెలంగాణ రాష్ట్రాన్ని అప్రజాస్వామిక పద్ధతిలో కేసీఆర్ కుటుంబం పాలిస్తుందని తమిళనాడు పీసీసీ ప్రెసిడెంట్,ఎమ్మెల్యే కె. ఎస్.అలగిరి అన్నారు. ఈ సందర్భంగా సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నంది కంటి శ్రీధర్ ఆధ్వర్యంలో మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబ అవినీతి పాలనతో ప్రజలంతా విసుగెత్తి పోయారని,అధికారులు కూడా విస్మయంతో ఉన్నారన్నారు.ప్రజలు కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని కోరుకుంటున్నారని,కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉంటామన్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజలకు ఆరు గ్యారెంటీ సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని ఇటీవలే జరిగిన సభలో కాంగ్రెస్ పెద్దలు తెలిపారని గుర్తు చేశారు.తెలంగాణ మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ప్రతినెల 2500 రూపాయలు,500 కె గ్యాస్ సిలిండర్,ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం,రైతు భరోసా,గృహజ్యోతి,ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్,ఇందిరమ్మ ఇండ్లు,ఇల్లు లేని వారికి ఇంటి స్థలం ఉంటే 5 లక్షలు, ఉద్యమకారులకు 250 చ. గ ఇంటి స్థలం,యువ వికాసం కింద విద్యార్థులకు 5 లక్షల విద్య భరోసా కార్డు, ప్రతి మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూల్స్, చేయూత ద్వారా 4000 నెలవారి పింఛన్లు,10 లక్షల రాజీవ్ ఆరోగ్యశ్రీ బీమా పథకాలను కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అమలు చేస్తుందన్నారు.

ప్రతి కార్యకర్త రోజుకు పదిమంది సామాన్య ప్రజలకు సంక్షేమాల గురించి వివరించి వారి చేత గ్యారెంటీ కార్డ్ లను తీసుకునేలా చేయాలని తెలిపారు.అనంతరం ఆరు గ్యారెంటీ కార్డు పథకాలను మల్కాజిగిరి నియోజకవర్గం నుంచి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ మల్లు రవి, కాంగ్రెస్ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణకు మూటలు ఎలాగూ ఇవ్వరు..

**హైదరాబాద్:** పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో తెలంగాణపై మోదీ చేసిన వ్యాఖ్యల పట్ల కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణకు మూటలు ఎలాగూ ఇవ్వరు.. కనీసం మర్యాదైనా చూపండని ఘాటుగా వ్యాఖ్యానించారు. తెలంగాణకు ఏం చేశారో చెప్పేందుకు.. మోదీ పాలనలో ఒక్క విషయమైనా లేదని ఎద్దేవా చేశారు. సందర్భంగా మోదీ చేసిన ప్రసంగం పై కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేశారు. "తెలంగాణ మీద.. ప్రధాని మోదీకి పదే పదే అక్కసు ఎందుకు. రాష్ట్రం ఏర్పడి పదేళ్లు అవుతున్నా ఎందుకీ వివక్ష? తెలంగాణ అంటేనే గిట్టనట్లు.. మా పుట్టుకను ప్రశ్నించడం పద్ధతేనా? పదే పదే తల్లిని చంపి బిడ్డను తీశారని మోదీ అంటున్నారు. అజ్ఞానం, అహంకారంతో ఇంకెన్నిసార్లు మా అస్తిత్వాన్ని అవమానిస్తారు. తెలంగాణకు ఏం చేశారో చెప్పేందుకు.. మీ పాలనలో ఒక్క విషయమైనా లేదు. అందుకే పదేపదే విషం చిమ్ముతున్నారని" ట్విటర్‌లో మంత్రి కేటీఆర్ ధ్వజమెత్తారు. తెలంగాణ ఏర్పాటును మోదీ అవమానించటం ఇదే తొలిసారి కాదని.. చారిత్రక వాస్తవాల పట్ల మోదీ నిర్లక్ష్యానికి ఇది అద్దం పడుతోందని కేటీఆర్ అన్నారు. స్వరాష్ట్రం కోసం తెలంగాణ ప్రజలు 60 ఏళ్లు పోరాడారని గుర్తు చేశారు. రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను జరుపుకోలేదని చెప్పడం.. అవాస్తవమన్నారు. పార్లమెంటులో కాంగ్రెస్‌ను విమర్శించే ప్రయత్నంలో తెలంగాణను అవమానిస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ ప్రజల త్యాగాలు, భావోద్వేగాలను మోదీ పరిగణించాలని హితబోధ చేశారు. "వడ్లు కొనండని అడిగితే నూకలు బుక్కమని.. మా రైతులని కించపర్చింది మీ కేంద్రమంత్రి కాదా. ఆవు చేలో మేస్తే.. దూడ గట్టున మేస్తదా.. మీలాగే మీ మంత్రులు. కోటి ఆశలు, ఆకాంక్షలతో పురుడుపోసుకున్న కొత్త రాష్ట్రానికి సహకరించకపోగా.. ఆది నుంచి కక్షను పెంచుకొని.. వివక్షనే చూపిస్తున్నారు కదా. ఏడు మండలాలు గుంజుకొని.. లోయర్ సీలేరు ప్రాజెక్టును లాక్కొని పురిట్లోనే మీరు చేసిన తొలిద్రోహాన్ని మర్చిపోం. నీతి ఆయోగ్ చెప్పినా నీతి లేకుండా మిషన్ కాకతీయ, భగీరథ నిధులు ఆపేశారు. కృష్ణా నీటి వాటాలు తేల్చకుండా పదేళ్లు దగా చేశారు. కాజీపేట ఫ్యాక్టరీని గుజరాత్‌కు తరలించుకుపోయారు. దశాబ్దాల కలను నాశనం చేశారు. 157 మెడికల్ కాలేజీల్లో ఒక్కటీ ఇవ్వలేదని అన్నారు. పద్నాలుగు సంవత్సరాలు పోరాడి.. దేశాన్ని ఒప్పించి మెప్పించి సాధించుకున్న స్వరాష్ట్రం పట్ల ఎందుకంత చులకన భావం అని ప్రధాని మోదీని మంత్రి కేటీఆర్ నిలదీశారు. ప్రజాస్వామ్య దేవాలయంలో ప్రతిసారి పనిగట్టుకొని.. తమ ఆత్మగౌరవాన్ని గాయపర్చి ఎందుకు ఆనందిస్తున్నారన్నారు. ఇలా బయ్యారం బొగ్గు గనులు, కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా, సింగరేణి ప్రైవేటీకరణ వంటి విషయాలపై మంత్రి కేటీఆర్ ప్రధానిని ట్విటర్ వేదికగా ప్రశ్నించారు. తెలంగాణలో డబుల్ డిజిట్ సీట్లు రావు : ఈడీ, ఐటీ, సీబీఐలను ఎన్డీయే కూటమిలో చేర్చుకొని.. ప్రతిపక్షాలపై ఉసిగొల్పి ప్రభుత్వాలను పడగొట్టడమే పనిగా పెట్టుకున్న బీజేపీకి పొద్దున లేచి ప్రజాస్వామ్య సుద్దులు చెప్పడం విచిత్రమని ఎద్దేవా చేశారు. డబుల్ ఇంజన్ నినాదంతో ఊదరగొట్టే భారతీయ జనతా పార్టీకి తెలంగాణలో డబుల్ డిజిట్ సీట్లు కూడా రావని జోస్యం చెప్పారు. డిపాజిట్లు పోగొట్టుకోవడంలో మీరు మళ్లీ సెంచరీ కొట్టడం పక్కానని కేటీఆర్ అన్నారు.

# మండల అభివృద్ధికి ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు కృషి

**అడవిదేవులపల్లి సెప్టెంబర్ 19 మన సాక్షి:**



అడవిదేవులపల్లి మండల అభివృద్ధికి మిర్యాలగూడ శాసనసభ్యులు నల్లమోతు భాస్కర్ రావు ఎంతగానో కృషి చేస్తున్నారని తెలంగాణ రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు.మంగళవారం అడవిదేవులపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జడ్పీ నిధులతో ఐదు లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన ఆర్చి ప్రహరీ గోడ నిర్మాణం పూర్తిచేసుకున్న సందర్భంగా మిర్యాలగూడ శాసనసభ్యులు నల్లమోతు భాస్కరరావు తెలంగాణ రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ట్రైకార్డ్ చైర్మన్ ఇస్లవత్ రామచంద్రనాయక్ తో కలిసి ప్రారంభించారు.అనంతరం మండల కేంద్రంలోని రైతు వేదికలో మాడ ట్రైకార్ పథకం కింద 74 మంది గిరిజనులకు మంజూరైన 91 లక్షల 25 వేల రూపాయల విలువగల చెక్కులను,70 మంది రైతులకు దశాబ్దాలుగా పెండింగ్లో ఉన్న మహాసుర భూములకు అసైన్డ్ భూములకు సంబంధించిన తెలంగాణ ప్రభుత్వం ద్వారా జారీ చేయబడిన పట్టా పాస్ పుస్తకాలను మండల బిఆర్ఎస్ నాయకులతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల వారికి అండగా ఉంటుందని అన్నారు. అలాగే నూతన అడవిదేవులపల్లి మండలంలో మన శాసనసభ్యులు ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు కృషితో పట్టు వదలకుండా దశాబ్దాలుగా కష్టపడే రైతుల చిరకాల వాంఛ బీడు భూములు సాగులోకి రావాలని ఆకాంక్షతో 300 కోట్ల రూపాయలతో దున్నపోతుల గండి చిట్యాల ఎత్తుపోతుల పథకాన్ని మంజూరు చేయించి పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయని అన్నారు.ఈ దున్నపోతుల గండి లిఫ్టు వినియోగంలోకి వచ్చిన తర్వాత మండల పరిధిలోని 14 వేల ఎకరాల భూమి సాగులోకి వస్తాయని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ ధనావత్ బాలాజీ నాయక్,జడ్పిటిసి కుర్ర సేవ్యా నాయక్,ఎంపీడీవో ఎండి షరీఫ్,ఎంపీఓ లలిత సుబ్బారెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు కొత్త మర్రెడ్డి,మండల టిఆర్ఎస్ అధ్యక్షులు కూరాకుల చిన్నరామయ్య,సర్పంచులు కుర్ర పకీర,తుమ్మల ఏడుకొండలు,బాలు నాయక్,భీమ్లా నాయక్, బొమ్మరబోయిన నాగేంద్రమ్మ రామారావు,టిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి కుర్ర శ్రీను,యువజన అధ్యక్షులు కుర్ర అశోక్,వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి వెంకటేశ్వర్లు,ఎంపిటిసిలు పేర్ల లింగయ్య,కుర్ర క్రాంతి కృష్ణ కాంత్, కో ఆప్షన్ సభ్యుడు షేక్ బాబు జాని, ఉప సర్పంచ్ కేశబోయిన కొండలు, మండల రైతు బంధు అద్యక్షులు సూర్య నాయక్,తదితరులు పాల్గొన్నారు.

# అటవీ హక్కుల చట్టం పై అవగాహన

**మెలియాపుట్టి. సెప్టెంబర్ 19. మన సాక్షి.**




శ్రీకాకుళం జిల్లా పాతపట్నం నియోజకవర్గం మెలియపుట్టి మండలంలో కెరశింగి పంచాయితీ పరిధిలో గొడ్డ గ్రామంలో కొత్తూరు వెలుగు అసోసియేషన్ అధ్వర్యంలో మంగళవారం అటవీ హక్కుల చట్టం 2006 పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తూరు వెలుగు కోఆర్డినేటర్ చిరంజీవి మాట్లాడుతూ...అటవీ హక్కుల చట్టం 2006 లో సెక్షన్ 3 (1) హక్కుల గురించి వివరించారు. అలాగేవ్యక్తి గత పట్టాలు పొందే హక్కు.ఉమ్మడి పట్టా హక్కుసంరక్షణ హక్కు పొందే హక్కులు ఆదివాసీలకు అవగాహన కల్పించారు.ఇప్పటి వరకు వ్యక్తి గత పట్టాలు సాధించుకోవడం జరిగిందన్నారు.ఇంకనూ సాధించుకోవడానికి ఉమ్మడి హక్కులు మరియు సంరక్షణ పొందవలసిన అవసరం ఉందన్నారు.అలాగే రికార్డ్స్ ఆఫ్ రైట్స్ లో ప్రభుత్వం ఆదివాసీ గిజన భూములు నమోదు చేస్తూ ఉన్నారు.వాటి ఉపయోగాలు గూర్చి తెలియజేశారు.ఆదివాసీ భూములు రికార్డ్స్ ఆఫ్ రైట్స్ లో నమోదు కాకపోతే గిజనుకలు అనేక నష్టాలు కలుగుతాయి అన్నారు. ఈ సమావేశంలో కేరాసింగి సర్పంచ్ పెద్దింటి అధిలక్ష్మి మరియు అప్పారావుగారు , జగన్ కళ్యాణి గొడ్డ, కెరసింగి,,మూల నేల బోంతు, జన్ని పేట, ఇళ్లయి పురం,పొగడ విల్లి, ఆంజనేయ పురం, అనంతగిరి గ్రామంలో ఆదివాసీ గిరిజనులు పాల్గొన్నారు

# జానయ్య ఆక్రమించిన నా స్థలాన్ని నాకు ఇప్పించండి.

**సూర్యాపేట రూరల్, 19సెప్టెంబర్, మనసాక్షి**



డిసిఎంఎస్ ఉమ్మడి నల్లగొండ జిల్లా చైర్మన్ వట్టె జానయ్య యాదవ్ భూ కబ్జాలు రోజుకొకటి పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి.గత నెల రోజులుగా ఆయన చేసిన భూ ఆక్రమణలతో సూర్యాపేట అట్టుడికి పోతుంది.సూర్యాపేట పరిసర ప్రాంతాలతో పాటు ఖమ్మం,కోదాడ మహబూబ్ నగర్,జనగాంమహబూబాబాద్,దంతాలపల్లి, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుండి ఆయన బాధితులు పలు పోలీస్ స్టేషన్ లలో కేసులు పెట్టిన విషయాన్ని తెలుసుకొని ఒక్కొక్కరు బయటకు వచ్చి తమ గోడును వెళ్లబోసుకుంటున్నారు. తాజాగా సోమవారం మరో బాధితుడు ఎంఏ అజీజ్, జానయ్య ద్వారా తనకు జరిగిన అన్యాయాన్ని విలేకరుల ముందు వాపోయారు.జానయ్య యాదవ్ తన స్థలాన్ని అక్రమంగా లాక్కున్నాడని తన భూమిని నా స్థలాన్ని నాకు ఇప్పించి న్యాయం చేయాలని మంత్రితో పాటు జిల్లా కలెక్టర్,ఎస్పీలను కోరారు.జిల్లా కేంద్రంలోని అంజనాపురి కాలనీ,రోడ్ నెంబర్ 7లో 500 గజాల స్థలాన్ని 2016లో వట్టె జానయ్య యాదవ్ సోదరుడు వట్టే కృష్ణ వద్ద ఆయన కొనుగోలు చేసినట్లు చెప్పారు.అట్టి డాక్యుమెంట్ నంబర్ 9322 / 2016 తో రికార్డు కూడా నమోదు అయినట్లు వెల్లడించారు.ఇందులో తనకు తెలియకుండా జానయ్య తన స్థలంలో 200.గజాలు స్థలాన్ని ఆక్రమణ చేసి చుట్టూ ప్రహరీగోడ కూడా నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. ఇదేంటని అడిగితే నువ్వు దిక్కున్న చోట చెప్పుకోమని,అడ్డు తగిలితే తాము చంపడానికైనా వెనకాడబోమని బెదిరించినట్లు తెలిపారు. నాటి నుండి తాను ఆ స్థలం వైపు వెళ్లలంటేనే భయం వేసేదన్నారు. ప్రస్తుతం అట్టి స్థలంలో తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు, న్యాయవాది మాంద్ర మల్లయ్య కుటుంబాన్ని జానయ్య నివాసం ఉంచినట్లు తెలిపారు. మల్లయ్యను నాస్థలం నాకు ఇవ్వాలని కోరితే జానయ్య త్వరలోనే బయటకు వస్తారని,రాగానే మీఅంత చూస్తామని పలుమార్లు బెదిరింపులకు గురి చేసినట్లు పేర్కొన్నారు.మంత్రికి ఫిర్యాదు చేసిన మీరు మమ్మల్ని ఏం చేయలేరని అసభ్యకరంగా మాట్లాడినట్లు మొర పెట్టుకున్నారు.అక్రమార్కులకు వణుకు పుట్టించాల్సిన ప్రముఖ న్యాయవాదులు కుంట్ల ధర్మార్జున్,బాణాల విజయ్ కుమార్,కంబాళ్లపల్లి శ్రీనివాస్ లు వారికి వత్తాసు పలకడం విడ్డూరంగా ఉందన్నారు.వీరితో పాటు నేను ఓ విలేఖరినని చెప్పుకుంటున్న అమృనాయక్ అనే అతను మా స్థలానికి వచ్చినప్పుడల్లా ఫోటోలు, వీడియోలు తీసి జానయ్య,క పంపిస్తానంటూ బెదిరింపులకు గురి చేసేవాడిని బోరున విలపించారు.



# బిజెపి పార్టీ నుండి బిఆర్ఎస్ పార్టీలోకి చేరికలు

**మర్రిగూడ సెప్టెంబర్ 19 మన సాక్షి**

మర్రిగూడ మండల కేంద్రంలోని రామ్ రెడ్డి పల్లి గ్రామానికి చెందిన వడ్డే సైదులు బిజెపి మర్రిగూడ మండల నాయకులు జిల్లా దళిత బందు డైరెక్టర్ లఫంగి నరసింహా, ఆధ్వర్యంలో మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరడం జరిగింది ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు లఫంగి కృష్ణ, లపంగి రత్నం, పాల్గొనడం జరిగింది

# స్వచ్ఛగా తీర్చిదిద్దేందుకు సహకరించాలి

**సూర్యాపేట రూరల్, 19సెప్టెంబర్,మనసాక్షి**




సూర్యాపేట మండలాన్ని స్వచ్ఛగా తీర్చిదిద్దడానికి ప్రతిఒక్కరూ సహకరించాలని సూర్యాపేట ఎంపిపి బీరవోలు రవీందర్ రెడ్డి పిలుపునిచ్చారు. స్వచ్ఛత హీ సేవ 2023 కార్యక్రమాన్ని సోమవారం సోలిపేట గ్రామంలో ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛభారత్, స్వచ్ఛ తెలంగాణలో భాగంగా సోలిపేట గ్రామంలో కలియ తిరుగుతూ పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించారు.గ్రామ ప్రజలు పంచాయతీ ట్రాక్టర్ కు చెత్తను అందించడం..తడి పొడి చెత్తను వేరుచేసి అందించాలని కోరారు. ప్లాస్టిక్ వాడకుండా సహకరించాలని కోరారు.సూర్యాపేట మండలాన్ని స్వచ్ఛ మండలంగా తీర్చిదిద్దుటకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.అంబేద్కర్ విగ్రహం వద్ద మానవహారం నిర్వహించారు. స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు.కార్యక్రమంలో కార్యదర్శి చంద్రశేఖర్, గ్రామ సర్పంచ్ శోభా రాణి, ఉపసర్పంచ్ సుగుణమ్మ, వార్డు మెంబర్లు..బిఆర్ యస్ పార్టీ సీనియర్ నాయకులు,ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులు ఈదుల యాదగిరి,సీనియర్ నాయకులు బీరవోలు శేఖర్ రెడ్డి,మేకల జయరాములు,కందుల అశోక్ రెడ్డి ,బాదిని వీరయ్య, బొడ్డు శ్రీరాములు,చందా గోపాల్ ,ఉప్పుల వెంకన్న, రామావత్ జానయ్య, తదితరులు పాల్గొన్నారు.

# కంకర రోడ్డుతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు

**మర్రిగూడ సెప్టెంబర్ 19 మన సాక్షి:**



రోడ్డును తవ్వి కంకర వేసి సీసీరోడ్డునిర్మించకుండా జనాలకునరకం చూపిస్తున్నఅధికారులపైకాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని వివరాల్లోకి వెళితే మర్రిగూడ మండల కేంద్రంలో బస్టాండ్ నుండి కొండూరు రోడ్డు వరకు 32 లక్షల వ్యయంతో ఆర్ అండ్ బి నిధుల తో గత నెల మునుగోడు ఎమ్మెల్యే కూసు కుంట్ల ప్రభాకర్ రెడ్డి శంకుస్థాపన చేయడం జరిగింది. కాంట్రాక్టర్ రోడ్డును తవ్వి కంకర వేసి సిసి రోడ్ నిర్మించడంలో తీవ్రమైన జాప్యం చేస్తున్నారని. ఈకంకరవల్లచాలాప్రమాదాలుజరుగుతున్నాయని. వాహనాలు వెళ్లినప్పుడు కంకర రాళ్లు ఎగిరిఇంట్లో పడుతున్నాయని దుమ్ము ధూళిఇంట్లోకివస్తుందని శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది మారిందని. ఈ రోడ్డు నిర్మించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న కాంట్రాక్టర్ పై అధికారులపై చర్యలు తీసుకోవాలని రోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్రజలు కోరుతున్నారు



# రాజకీయ కుట్రతోనే చంద్రబాబు అరెస్ట్

**మిర్యాలగూడ టౌన్, సెప్టెంబర్ 19, మన సాక్షి:**

తెలుగుదేశం జాతీయ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్య మంత్రి చంద్రబాబు అక్రమ అరెస్ట్ ను ఖండిస్తూ అఖిల భారత బాల కృష్ణ అభిమాన సంఘము, (నందమూరి యువసేన )తలపెట్టినటీడీపీ వ్యవస్థాపక అధ్యక్షులు స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల లు వేసి నరరూపక సైకో,16నెలలు జైల్లో ఉండి బేలుమీద తిరుగుతున్న జగన్రాజకీయ కక్ష,ను అధికార దుర్వినియోగం చేసి, కెసిఆర్, మోడీ జగన్ లు కలిసి కుట్ర చేసి బాబు అరెస్ట్ చేశారు అని అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీఎన్ఎస్ఎఫ్ ఉపాధ్యక్షులు మచ్చా సైదులు మాట్లాడుతూజగన్ కుట్ర చేసిన చంద్రబాబు అక్రమ అరెస్ట్ ను ఖండించారు.రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షులు నసీరోద్దీన్ బాబా, మండల కన్వీనర్ చిలకల వెంకన్న,రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఉప్పలపాటి గోపాలకృష్ణ ,రాష్ట్ర దళిత అధికార ప్రతినిధి నూక పంగు కాశయ్య, రాష్ట్ర బీసీసీల్ కార్యదర్శి గంధం శ్రీనివాస్, ఐటీడీపి పార్లమెంట్ నాయకులు నాగేందర్, పార్లమెంట్ బీసీసీల్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు,దమరాచర్ల మండల కన్వీనర్ పగిడేపాటి రాంరెడ్డి, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రమేష్ నాయక్,నాయకులు బొట్టు శ్రీను, పోట్ల శంకర్ రావు, ఏచూరి అనంత రాములు, గర్దాస్ ప్రభాకర్, గంధం సత్యనారాయణ, సజ్జల వెంకటరెడ్డి, అనుముల సైదులు,నవీన్, నాగరాజు, శోభన్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు

# అధికారులు- ఉద్యోగుల ఓటర్ అవగాహన ర్యాలీ

**సూర్యాపేట సెప్టెంబర్19 మనసాక్షి**



ప్రభుత్వ ఉద్యోగులు ,అధికారుల ఆధ్వర్యంలో ఓటరు అవగాహన ర్యాలీని సూర్యాపేట పట్టణంలో నిర్వహించారు ఇట్టి ర్యాలీని జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సిహెచ్ ప్రియాంక ,జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ ఏ వెంకట్ రెడ్డి సంయుక్తంగా జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ముందుగా ఓటర్ అవగాహనరాలి వాహన బ్యానర్ పై "నేను తప్పక ఓటు వేస్తాను" అని సంతకాల సేకరణ చేశారు. దీనిలో ముందుగా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంతకం చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకట్ రెడ్డి ,సిపిఓ వెంకటేశ్వర్లు, ఎంప్లాయ్మెంట్ ఆఫీసర్ మాధవరెడ్డి, డిఎఫ్ఓ సతీష్ కుమార్ , జిల్లా అగ్రికల్చరల్ ఆఫీసర్ రామారావు నాయక్, జిల్లా హార్టికల్చర్ ఆఫీసర్ శ్రీధర్ ,అధికారులు సంతకాలు చేశారు. అనంతరం కలెక్టరేట్ నుండి ర్యాలీ ప్లే కార్డ్స్ పట్టుకొని నినాదాలు చేస్తూ ర్యాలీ మొదలు కాగా కొత్త కలెక్టరేట్, ఖమ్మం క్రాస్ రోడ్డు నుండి కొత్త బస్టాండ్ మీదుగా శంకర్ విలాస్ ద్వారా జూనియర్ కాలేజ్ ముందు నుండి మెడికల్ కాలేజీ వరకు మోటర్ బైక్ ,ఫోర్ వీలర్స్ ర్యాలీ సాగింది, అనంతరం మెడికల్ కాలేజ్ వద్ద స్వీప్ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ర్యాలీ ఉద్దేశించి అదనపు కలెక్టర్లు మాట్లాడారు 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు తమ ఓటును నమోదు చేసుకోవాలని ,అలాగే జరగబోవు ఎన్నికలలో అందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ,ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా నిర్భయంగా ఓటు వేయాలని వారు కోరారు.

ఈ కార్యక్రమంలో డీఎస్పీ నాగభూషణం, కలెక్టరేట్ ఏవో సుదర్శన్ రెడ్డి, సూర్యాపేట ఆర్డిఓ వీర బ్రహ్మచారి ,తాసిల్దార్ శ్యామ్ సుందర్ రెడ్డి, చివ్వెంల తాసిల్దార్ ఏ రంగారావు , ఇండస్ట్రియల్ అధికారి తిరుపతయ్య, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



# జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కు సన్మానం

**వేములపల్లి7, సెప్టెంబర్ 19, మన సాక్షి**

రావుల పెంట ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న ఏలేటి వినోద్ కుమార్ సర్వేపల్లి రాధాకృష్ణ జన్మదినం సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు స్వీకరించిన సందర్భంగా వారికి ఉపాధ్యాయులు విద్యార్థులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు భూక్య లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు విలువలతో కూడిన విద్యతోపాటు జీవన నైపుణ్యాలను విద్యార్థులకు అందజేస్తారని, వారి యొక్క భవిష్యత్తును తీర్చిదిద్దే వ్యక్తులు ఉపాధ్యాయులు అని, విద్యార్థుల యొక్క భవిష్యత్తు తరగతి గదిలో నిర్మితమవుతుందని, ఆ నిర్మితమవుతున్న తరగతి గదిలో ఉపాధ్యాయుడు నిరంతర శ్రామికుడిగా పని చేస్తాడని అలా పనిచేసి ఉత్తమ పౌరులను తయారు చేయడమే లక్ష్యమని, వారు ఉన్నత శిఖరాలకు చేరుకున్నప్పుడు ఆనందించే వ్యక్తులే ఉపాధ్యాయులని అన్నారు.మాజీ ప్రధానోపాధ్యాయురాలు మంగళ మాట్లాడుతూ ఉపాధ్యాయులు నిరంతర విద్యార్థులు గా ఉంటూ బోధన చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జగన్ మోహన్, వినోద్ కుమార్, అమరేందర్ రెడ్డి, కృష్ణయ్య, శ్రీధర్, చైతన్య, వెంకయ్య, గుడిపాటి కోటయ్య, విజయనిర్మల, నాగలక్ష్మి ,సక్కుబాయి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.....

# "బిఆర్ఎస్ పార్టీలోకి జోరుగా వలసలు"

## ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

**మునగాల .మనసాక్షి, సెప్టెంబర్ 19**




రానున్న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో మూడోసారి బిఆర్ఎస్ పార్టీ గెలుపు ఖాయం అని కోదాడ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. మంగళవారం కోదాడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యలయం లో మునగాల మండలంలోని తాడువాయి గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన 80 కుటుంబాలు ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ గారి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు.బిఆర్ఎస్ పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.....తెలంగాణలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ గారిది అని, దేశంలో ఎక్కడా లేనివిధంగా అభివృద్ధి పథకాలు అమలు చేస్తున్న ఏకైక ముఖ్య మంత్రి కేసీఆర్ అని అన్నారు.దేశ ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు దిక్కులేని పార్టీగా మారింది. తెలంగాణ రాష్ట్రంలో 2014 సంవత్సరానికి ముందు ఆకలి చావులు ఉండేవి. నేడు కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో ప్రజల మూడు పూటలు కడుపు నింపుతున్న ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ కి దక్కిందన్నారు.నేటికీ బిజెపి పాలిత ప్రాంతాలలో ప్రజల ఆకలి చావులు కొనసాగుతున్నాయి.రాష్ట్రంలో వ్యవసాయ ఆధారిత విద్యుత్ 24 గంటలు అందిస్తున్నామన్నారు.యావత్ భారత దేశం ముఖ్యమంత్రి కేసీఆర్ కోసం నిరీక్షిస్తుందన్నారు.నియోజకవర్గంలో ప్రజా సంక్షేమ పథకాలన్నే పకడ్బందీగా అమలవుతున్నాయంటూ కితాబిచ్చారు.దేశ రాజకీయాల్లో పెను ప్రకంపనలు సృష్టించిన కేసీఆర్ పాత్ర కీలకం కానుందని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టి పకడ్బందీగా అమలు చేస్తున్న ప్రతీసంక్షేమ పథకాన్ని క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రధాన పాత్ర పోషించాలని ఆయన పిలుపునిచ్చారు.బీఆర్ఎస్ పార్టీ శ్రేణులంతా సమన్వయంతో ముందుకెళ్లాలని కోరారు.. బీఆర్ఎస్ ప్రభుత్వం అందజేస్తున్న ప్రతీసంక్షేమ పథకాన్ని క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లేందుకు కార్యకర్త ప్రధాన పాత్ర పోషించాలని సూచించారు. పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో 9ఏండ్ల కాలంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు మరెక్కడా అమలుకావడం లేదన్నారు. .ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు తోగారు రమేష్, మాజీ జెడ్పిటిసి కోలా ఉపేందర్, సర్పంచ్ సంజీవ, మాజీ సర్పంచ్ లాక్య నాయక్, గ్రామ శాఖ అధ్యక్షులు చిర్ర సైదులు, గట్టు ఉపేందర్ ,కోలా ఆంజనేయులు,దేశగాని నాగమ్మ యాదగిరి,యల్లారెడ్డి, ఎంకన్న, మౌనిక, బిఆర్ఎస్ పార్టీ నాయకులు గోపి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదాల నివారణకు హైబ్రిడ్ పోట్టి తాటి చెట్లు పెంపకం

## - ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

**ఇల్లంతకుంట,సెప్టెంబర్ 19, మన సాక్షి:**



ప్రమాదాల నివారణకు పొట్టి తాటి చెట్లు అందించడం జరుగుతుందని మానకొండూర్ శాసన సభ్యులు రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామంలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పొట్టి తాటి మొక్కలను నాటారుబి. బిఅనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్ సొంత ఖర్చులతో పొట్టి తాటి చెట్టు విత్తనాలను బీహార్ రాష్ట్రం నుండి తెప్పించడం జరిగిందని అన్నారు. ప్రభుత్వం గౌడన్నలకు ప్రమాద బీమా 5 లక్షలుఇస్తుందని , 50 సంవత్సరాలు నిండిన గౌడన్నలకు ఆసరా పెన్షన్లు ఇస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ సిద్దం వేణు , ఎంపిపి వూట్కూరి వెంకట రమణారెడ్డి , వైస్ ఎంపిపి సుదగోని శ్రీనాథ్ గౌడ్,మార్కెట్ కమిటీ చైర్మన్ మామిడి సంజీవ్, సర్పంచ్ జితేందర్ గౌడ్,గౌడసంఘంనాయకలుగజ్జెల రాజశేఖర్ గౌడ్,నాయిని రమేష్ గౌడ్,ఉప సర్పంచ్ కుమార్ గౌడ కులస్తులు పాల్గొన్నారు.




# ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి.

**చింతపల్లి. సెప్టెంబర్ 19 మన సాక్షి**

ఈనెల 18 నుండి 22 వరకు జరిగే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం చింతపల్లి మండల కేంద్రంలోని జాతీయ రహదారి పక్కన చింతపల్లి మండలం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష ఆ సంఘం ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు వింజమూరు కృష్ణ మాదిగ హాజరై నిరాహార దీక్షలోపాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో పలుమార్లు ఎస్సీ రిజర్వేషన్ పై చట్టబద్ధకం కల్పిస్తానని ప్రభుత్వాలు హామీ ఇస్తున్నాయి తప్ప నెరవేర్చడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయని వారు ఆవేదనపరిచారు. ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో దళితులను వాడుకొని ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్న తప్ప దళితులకు చేసింది శూన్యమని వారు ఆవేదన వ్యక్తపరిచారు. జనాభా ప్రాతిపదికన ఎస్సీ రిజర్వుడు స్థానాలకు సీట్లను కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. అదే విధంగా పార్లమెంట్లో ఎస్సీ వర్గీకరణ పై చట్టబద్ధత కల్పించి దళితులకు న్యాయం చేకూర్చాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత 30 సంవత్సరాల నుండి ఎస్సీ వర్గీకరణ పై చట్టబద్ధత కల్పించాలని దళితులు పోరాటాలు చేస్తున్నప్పటికీ పాలకులు నిర్లక్ష్యం వహించడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. పార్లమెంటులో మహిళా బిల్లును ఏ విధంగా ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారో అదే విధంగా ఎస్సీ వర్గీకరణ కూడా పార్లమెంటులో ప్రవేశపెట్టి వెంటనే అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని ప్రభుత్వాలను హెచ్చరించారు. ఈ నిరాహార దీక్ష కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ సందే ఏసు, ఓసుకుల భరతయ్య, నల్ల శంకర్, నల్ల వెంకటయ్య, ఊరే భాస్కర్, నల్ల కాశయ్య, బుష్పాక సీనయ్య, కొడుదుటి శంకర్, జంగయ్య, మధు, కంబాలపల్లి రామకృష్ణ, ముసుగు వెంకటయ్య, శ్రీను, నగేష్, నల్ల సైదులు, వి సూర్య, కాటేపాక సైదులు, వి క్రాంతి, ఎం గణేష్, సిహెచ్ రామకృష్ణ, బి ప్రశాంత్, ఆది మల్ల మాస్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# "ఇండియాస్ గ్రీన్ హార్ట్ దుశర్ల సత్యనారాయణ"

**సూర్యాపేట సెప్టెంబర్19 మనసాక్షి**




తెలంగాణలోని సూర్యాపేటకు చెందిన 69 ఏళ్ల పర్యావరణవేత్త దుశర్ల సత్యనారాయణపై "ఇండియాస్ గ్రీన్‌హార్ట్ దుశర్ల సత్యనారాయణ" అనే డాక్యుమెంటరీ చిత్రాన్ని ఢిల్లీలో ప్రదర్శించనున్నారు. డాక్యుమెంటరీ ప్రదర్శన తర్వాత చర్చ కూడా ఉంటుంది.

హైదరాబాద్‌కు చెందిన చిల్కూరి సుశీల్ రావు నిర్మించి, దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఇందిరా గాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ఆర్ట్స్‌లో సెప్టెంబర్ 22-24 నుండి ఐ ఎన్ జి సి ఏ , జన్‌పథ్ బిల్డింగ్, న్యూ వద్ద జరుగుతున్న 4వ నాడి ఉత్సవ్‌లో ప్రదర్శించబడుతుంది. ఢిల్లీ.

మూడు రోజుల పాటు దేశవ్యాప్తంగా సినీ నిర్మాతలు రూపొందించిన 15 డాక్యుమెంటరీలను ప్రదర్శించనున్నారు.నాడి ఉత్సవ్‌లో భాగంగా 'నదికి కృతజ్ఞతలు: మానవ మరియు నదీ జీవితాల మధ్య సామరస్యాన్ని పునరుద్ధరించడం' అనే అంశంపై జాతీయ సదస్సు జరగనుంది. ఈ సెమినార్ పండితులు, విద్యావేత్తలు, పరిశోధకులు మరియు సంబంధిత వాటాదారులకు అన్ని రకాల జీవులకు నదులు మరియు నీటి వనరుల ఔచిత్యాన్ని ఉద్దేశించి చర్చించడానికి వేదికను అందించడం లక్ష్యంగా పెట్టుకుంది. సెమినార్ నదీతీర సంస్కృతికి ప్రత్యేక సూచనతో సుస్థిర అభివృద్ధి భావనను పునర్నిర్వచించే లక్ష్యం కూడా కలిగి ఉంది.

భారతదేశంలోని తెలంగాణలోని సూర్యాపేట పట్టణానికి సమీపంలోని రాఘవపురంలో తన 70 ఎకరాల పూర్వీకుల భూమిలో అడవిని సృష్టించిన ప్రకృతి ప్రేమికుడు మరియు పర్యావరణవేత్త దుశర్ల సత్యనారాయణ గురించి "ఇండియాస్ గ్రీన్‌హార్ట్ దుశర్ల సత్యనారాయణ" డాక్యుమెంటరీ. అతను ఆరు దశాబ్దాల క్రితమే అడవిని అభివృద్ధి చేయడం ప్రారంభించాడు మరియు దానిని సంరక్షిస్తున్నాడు. అతను చిన్నతనంలో ప్రకృతితో ప్రేమలో పడ్డాడు మరియు సంకల్పం మరియు ఆసక్తితో ఒక మొత్తం అడవిని పెంచవచ్చని నిరూపించాడు.ఫ్లోరైడ్‌తో అల్లాడుతున్న నల్గొండ జిల్లా ప్రజలకు స్వచ్ఛమైన, తాగునీరు అందించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లిన సత్యనారాయణకు దేశంలోనే పేరుంది. తన అడవిలో, అతను ఒక అద్భుతమైన దృశ్యాన్ని అందించే తామరలు వికసించే సరస్సును నిర్వహిస్తాడు. ప్రభుత్వ అధికారులు, పర్యావరణవేత్తలు, పక్షి పరిశీలకులు మరియు హరిత యోధులు అన్ని వైభవంగా బాగా సంరక్షించబడిన అడవిని సందర్శిస్తారు.

# భూకబ్జా ముఠాల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలి

**సూర్యాపేట సెప్టెంబర్19 మనసాక్షి**



సూర్యాపేట లో అధికార పార్టీ నాయకుల అండతో కొనసాగుతున్న భూ కబ్జా ముఠాల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యాపేట నియోజకవర్గ ఇన్చార్జ్ ధర్మార్జున్ కోరారు స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ .ఒకవైపు టిఆర్ఎస్ నాయకుడు మంత్రి అనుచరుడు వట్టే జానయ్య భూ ఆక్రమణలకు వ్యతిరేకంగా జానయ్య భూ బాధితులు రోడ్డు మీది కెక్కితే , మరొక టిఆర్ఎస్ నాయకుడు మంత్రి అనుచర బృందం బాధితుల కు సహాయం చేస్తామంటూ బేరాలు చేసుకుంటూ కొత్త దందాకు తెరలేపారు. తెలిసో తెలియకో జానయ్య, అతని బంధువుల వద్ద, అతని అనుచరుల వద్ద కొనుగోలుచేసిన వారి పైన, కిరాయికి వున్న వారి పై దాడులు చేస్తున్నారు. సూర్యాపేట న్యాయవాది తెలంగాణ జిల్లా అధ్యక్షుడు మాంద్ర మల్లయ్య యాదవ్ అంజనా పురి కాలనీ లో అద్దెకు తీసుకొని నివసిస్తున్న ఇంటి పైకి గత పది రోజుల క్రితం ఒక బి ఆర్ ఎస్ నాయకుడు జెసిబి లు 50 మంది అనుచరులతో దాడికి పూనుకొని ఇంటి కాంపౌండ్ ధ్వంసం చేస్తుండగా మాంద్ర మల్లయ్య ఎందుకు మీరు ఇంటి కాంపౌండ్ కూడా ధ్వంసం చేస్తున్నారు అని ప్రశ్నించగా ఈ ఇంటి స్థలము వేరే వాళ్ళదని అందుకనే మేము గోడ కూలుస్తున్నామని చెప్పగా మేము కిరాయి కున్నాము మీకు ఏమైనా సమస్యలు ఉంటే మా ఇంటి ఓనర్ తో మాట్లాడుకోండి అని సముదాయించగా చర్చించుకుంటామని చెప్పి వెళ్ళిపోయరని వినాయక చవితి రోజున మళ్లీ ఏకా ఎక్కిన నజీర్ అనే వ్యక్తి మరియు ఆ టిఆర్ఎస్ నాయకుడు మళ్ళీ వంద మంది జనాలతో వచ్చి దాడి చేసి ఆ ఇంటి కాంపౌండ్ గోడను కాంపౌండ్ పరిధిలో ఉన్న వస్తువులను ధ్వంసం చేసి అడ్డుకొనుటకు ప్రయత్నించిన మల్లయ్య భార్యపై దాడికి తెగబడ్డారు. ఈ విషయమై పోలీసులకు ఫోన్ చేయగా వచ్చి సమస్యను పరిష్కరించుకోండి అని సలహా ఇచ్చి వెళ్ళిపోయారని ఆవేదన వ్యక్తంచేశారు అయినా ఆ నాయకుడు తన విధ్వంసం ఆపకుండా విధ్వంసం సృష్టించాడు పోలీస్ లకు దరఖాస్తు చేసుకున్న ఇంతవరకు కేసు నమోదు చేయకపోవడం విచారకరం అన్నారు. సూర్యాపేటలో రోజురోజుకు పెచ్చుమీరుతున్న భూకబ్జా ముఠాదారుల ఆగడాలను అరికట్టాలని స్థానిక శాసనసభ్యులకు పోలీస్ ఉన్నదా అధికారులను రెవెన్యూ అధికారులను తెలంగాణ జన సమితి డిమాండ్ చేస్తుందన్నారు . లేనియెడల బాధితుల పక్షాన నిలబడి సూర్యాపేటలో భూకబ్జాదారుల ఆగడాలను ఎదుర్కోవడానికి బహిరంగంగా ముందుకు వస్తామని తెలిపారు. మొత్తంగా సూర్యాపేట లో జరుగుతున్న పరిణామాల పై న్యాయ విచారణ జరపాలని ధర్మార్జున్ కోరారు.

ఈ సమావేశంలో జన సమితి రాష్ట్ర కమిటీ సభ్యులు గట్ల రమేష్, శంకర్ జిల్లా ఉపాధ్యక్షులు కంబాలపల్లి శ్రీనివాస్, లీగల్ సెల్ జిల్లా కన్వీనర్ కుంచం చంద్రకాంత్, కో కన్వీనర్ వీరేష్ నాయక్, పట్టణ పార్టీ అధ్యక్షులు బందర్ నాయక్, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ బచ్చలకూరి గోపి, విద్యార్థి జన సమితి జిల్లా అధ్యక్షులు బొమ్మగాని వినయ్ గౌడ్, ఉపాధ్యక్షులు ఈశ్వర్ సింగ్ ,యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు

# చదువు ఇష్టం లేక పురుగుల మందు తాగి యువకుడు మృతి

**మాడ్గులపల్లి సెప్టెంబర్ 19 మన సాక్షి**



మాడ్గులపల్లి మండలం జాలుభావి గూడెంకు చెందిన 15 సంవత్సరాల యువకుడు చదువు మీద ఆసక్తి లేక జీవితం పై విరక్తి చెంది పురుగుల మందు తాగి మరణించాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం చిరుమర్తి గ్రామం, జలుబావి గూడెం కు చెందిన ఖాదర్ పాష కుమారుడు అమ్రీన్(15) సోమవారము రోజు మధ్యాహ్నం 3 గంటల సమయంలో, పురుగుల మందు తాగి మరణించినట్టు గ్రామస్థులు తెలిపారు. మృతుడి తండ్రి ఖాదర్ పాష పిర్యాదు మేరకు ఎస్ఐ నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.




# ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం

**మిర్యాలగూడ టౌన్, సెప్టెంబర్ 19, మన సాక్షి:**

భారతీయ జనతా మహిళా మోర్చా ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ఈరోజు చట్టసభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కు ఆమోదం తెలపడం భారతదేశ చరిత్రలో సువర్ణ ఘట్టంగా లికించదగ్గ విషయం ఈ సందర్భంగా హనుమాన్ పేట ఐలమ్మ విగ్రహం నుండి గాంధీ బొమ్మ వరకు విద్యార్థినిలతో భారీ ర్యాలీ నిర్వహించిరు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.. ఈ సందర్భంగా జిల్లా మహిళా మోర్చా అధ్యక్షులు కొండేటి సరిత మాట్లాడుతూ దేశ ఉజ్వల భవిష్యత్తుకు మహిళలు చేస్తున్న కృషిని,

వారి శక్తిని గుర్తించి నేడు 33 శాతం రిజర్వేషన్ కలిపించినందుకు ప్రధాని మోదీ ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమం లో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాధినేని శ్రీనివాస రావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు తుమ్మలపల్లి హనుమంతరెడ్డి,మున్సిపల్ కౌన్సిలర్ చిలుకూరి రమాదేవి,మండల పార్టీ అధ్యక్షురాలు యాదమ్మ, పట్టణ ప్రధాన కార్యదర్శి చిలుకూరి శ్యామ్, సీతారామ్ రెడ్డి, అశోక్ రెడ్డి, షేక్ బాషా, కొండేటి శేఖర్, కంచుకోమ్ముల వేణు, రేణుక, విజయలక్ష్మి, మాలతి, సంధ్యారాణి, వసంత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు...

# దళితులు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలి

## - ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్

**ఇల్లంతకుంటసెప్టెంబర్ 19, మన సాక్షి:**



దళితులు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో సిఎం కేసీఆర్ దళిత బంధు పథకం ప్రవేశపెట్టారని మానకొండూర్ శాసన సభ్యులు రసమయి బాలకిషన్అన్నారు.మండలంలోని కేశన్నపల్లె గ్రామానికి చెందిన చిట్యాల మల్లయ్యకు ధళిత బంధు పథకం ద్వారా మంజూరైన 10 లక్షల రుపాయలతో డీజే సౌండ్స్ సెట్ ను ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ చిట్యాల మల్లయ్య కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా రసమయి మాట్లాడుతూ సమాజంలో నెలకొన్న తారతమ్యాలను రూపుమాపడమే దళిత బంధు ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. దళిత బంధు పథకం ద్వార లబ్ది పొందిన లబ్దిదారులు అందరూ యూనిట్లను సద్వినియోగం చేసుకుంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ కన్న కళలను నిజం చేస్తూ అభివృద్ధి చెందాలని కోరారు. ఆనంతరం లబ్దిదారు చిట్యాల మల్లయ్య మాట్లాడుతూ దళిత బంధు యూనిట్ కు కృషి చేసిన మానకొండూర్ శాసన సభ్యులు రసమయి బాలకిషన్ కు జీవితాంతం రుణపడి ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, సర్పంచులు పోతరాజు ఎల్లవ్వ నర్సయ్య, ఎలుక స్వామి లక్ష్మీ, సావనపెల్లి వనజ అనిల్ పాల్గొన్నారు.

# అంగన్వాడీ సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి..

### ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి..

**చింతపల్లి. సెప్టెంబర్ 19 మన సాక్షి.**



అంగన్వాడి వరకర్ల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం చింతపల్లి మండల కేంద్రంలో అంగన్వాడీలు చేస్తున్న సమ్మె తొమ్మిదో రోజుకు చేరుకుంది అందులో భాగంగా రోడ్డుపై అంగన్వాడి కార్యకర్తలు ఆయాలు రోడ్డుపై వంట వార్పు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఏఐటియుసి సిఐటియు ప్రజా సంఘాలు అంగన్వాడీలు చేస్తున్న సమ్మెకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా పలు సంఘాల నాయకులు మాట్లాడుతూ గత తొమ్మిది రోజులుగా అంగన్వాడి టీచర్లు ఆయాలు సమ్మె చేస్తున్నప్పటికీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్లైనా లేదని వారు ఆవేదన వ్యక్తపరిచారు. ప్రభుత్వం అంగన్వాడి సమస్యలు పరిష్కరించకుండా సమ్మెను విచ్చిన్నం చేయాలని చూడడం ఎంతవరకు సమంజసం అని వారు ప్రశ్నించారు. బెదిరింపులతో ఉద్యమాన్ని ఆపలేరని గత 48 ఏళ్లుగా ఐసీడీఎస్ లో పనిచేస్తు గౌరవ వేతనం పేరుతో వెట్టిచాకి రి నిర్వహిస్తున్నారని మహిళల శ్రమ దోపిడీకి పాల్పడుతున్నారని వారు ఆ ఆవేదన వ్యక్తపరిచారు. భద్రత లేని బతుకులు చాలీచాలని వేతనాలతో శ్రమదోపిడి చేసుకుంటారని వారు ఆవేదన వ్యక్తపరిచారు. తక్షణమే ప్రభుత్వం చర్చలు జరిపి హామీలు అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. కానీ సవే తన చట్ట ప్రకారం పనిచేసే మహిళకు 26 వేల రూపాయలు అందించాలని వారు డిమాండ్ చేశారు. బెనిఫిట్ టీచర్ కు 10 లక్షల రూపాయలు ఆయాలకు ఐదు లక్షల రూపాయలు ఇవ్వడంతోపాటు హెల్త్ కార్డులు ప్రభుత్వ విమానం వర్తింపచేయని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా పెండింగ్లో ఉన్న టీఏ డి ఏ లను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు, తెలంగాణ ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి చెల్లం పాండురంగారావు, సిఐటియు డివిజన్ కార్యదర్శి ఎన్ వెంకటయ్య, అంగన్వాడి జిల్లా ఉపాధ్యక్షురాలు, వి రమాదేవి, సరిత, అంజలి, యాదమ్మ, యశోద,, నిర్మల, రమణ, స్వరాజ్యం, వీణ, వెంకటమ్మ, పద్మ, బక్కమ్మ, విజయ,, లక్ష్మి, అలివేలు, లలిత, కౌసల్య,, పద్మ శారద, పుల్లమ్మ, విఘ్నేశ్వరి, జయమ్మ, శోభారాణి, రజిత, సులోచన, శ్రీకాంత్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# ఎస్సి వర్గీకరణ దీక్షలకు జనసేన మద్దతు

**జగిత్యాల ప్రతినిధి, సెప్టెంబర్ 19,(మన సాక్షి):**

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఎస్సి వర్గీకరణపై చేపట్టిన నిరసన దీక్షలు 9 వ రోజుకు చేరగా మంగళవారం జనసేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ బెక్కం జనార్దన్ ఆధ్వర్యంలో జనసేనికులు మద్దతు తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట గత తొమ్మిది రోజులుగా ఎస్సి వర్గీకరణ సాధనే లక్ష్యంగా నిరసన దీక్షలు కొనసాగుతున్నాయి. ఈ దీక్షలకు మద్దతు తెలిపిన తదుపరి బెక్కం జనార్దన్ మాట్లాడుతూ 77 ఏండ్ల స్వతంత్ర భారత దేశంలో ఎస్సి ఉమ్మడి రిజర్వేషన్లతో దశాబ్దాల తరబడి ఏకపక్ష దోపిడీకి గురవుతున్నారన్నారు.జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ల కోటాలో ఎవరివాటా వారికి న్యాయబద్ధంగా అందాలంటే ఎస్సి వర్గీకరణ జరగాలని బిజెపి వెంటనే నిర్ణయం తీసుకోవాలని జనార్దన్ కోరారు. 9వ రోజు వర్గీకరణ సాధన దీక్షలను జిల్లా ఎస్సి ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ సభ్యులు దూమాల రాజుకుమార్ ప్రారంభించగా ఈ కార్యక్రమంలో ఎం.ఎస్పి కో కన్వీనర్ సతీష్ మాదిగ,ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ సురుగు శ్రీనివాస్, మాదిగ జగిత్యాల నియోజికవర్గ ఇంఛార్జి బొనాగిరి కిషన్, కో ఇంఛార్జి మిసాల సాయిలు, పట్టణ ఇంఛార్జి బోల్లారపు దివాకర్, అర్బన్ మండల ఇంఛార్జి బిరుదులు గంగారాం, జనసెన పార్టీ రూరల్ మండల అధ్యక్షులు బొల్లి రాము, పట్టణ అధ్యక్షులు చింత సుధీర్, మెస్రి లక్ష్మణ్, బుగ్గారం మండల ఇంచార్జ్ చిర్ర లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# దేశానికి దిక్సూచి తెలంగాణ..!



### బిఆర్ఎస్ పేదల ప్రభుత్వం

### మంత్రి తన్నీరు హరీష్ రావు

### బిఆర్ఎస్ పార్టీలో భారీగా చేరికలు

**కంగ్టి, సెప్టెంబర్ 19, మన సాక్షి**



తెలంగాణ దేశానికే దిక్సూచిగా నిలిచిందని ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖల మంత్రి హరీష్ రావు పేర్కొన్నారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా నూతన తడ్కల్ మండల కేంద్రంలో ఎమ్మెల్యే మహా రెడ్డి భూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రి హరీష్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ తోనే అభివృద్ధి సాధ్యమని, అన్ని వర్గాలకు ప్రభుత్వ పథకాల్లో ప్రాధ్యాన్యాతనిస్తూ,ఎదురులేని శక్తిగా ఎదుగుతున్న దన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు. ఇక్కడ అమలు చేస్తున్న పథకాలనే పక్క రాష్ట్రాలు కాపి కొడుతున్నాయని తెలంగాణ దేశానికి రోల్ మాడల్ గా నిలుస్తున్నాదన్నారు.

ఎంపల్లి కళ్యాణమండపం రూ.15 లక్షలతో నిర్మించారు. మైనార్టీ షాది ఖానా రూ. 20 లక్షలతో నిర్మించారు. కులం మతం వర్గ అని తేడా లేకుండా అందరి కోసం పనిచేసే ప్రభుత్వం బిఆర్ఎస్ ప్రభుత్వమన్నారు.

తడ్కల్ కేంద్రంగా మండలాన్ని ఏర్పాటు చేసి ఇక్కడి ప్రజల చిరకాల ఆకాంక్షను సహకారం చేసిన ఘనత సీఎం కేసీఆర్, మంత్రి హరీష్ రావు, ఎమ్మెల్యే మహా రెడ్డి భూపాల్ రెడ్డి లకు దక్కిందన్నారు.

**" బీఆర్ఎస్ లో చేరికలు జోరు"**

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో వలసలు జోరుగా కొనసాగుతున్నాయని మంత్రి హరీష్ రావు,ఎమ్మెల్యే మహా రెడ్డి భూపాల్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి గులాబి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్ పర్సన్ మంజుశ్రీ, బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు గంగారం, జడ్పిటిసి కోట లలిత ఆంజనేయులు, ఎంపిపి సంగీత వెంకటరెడ్డి, ఆత్మ కమిటీ డైరెక్టర్ రమేష్, సొసైటీ డైరెక్టర్ హనుమంత్ రెడ్డి, సర్పంచ్ గడ్డపు మనోహర్, ఎంపిటిసి శ్రీకాంత్,కో ఆప్షన్ సభ్యులు అహ్మద్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు ,కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ భర్తపై చర్యలు తీసుకోవాలి

### - ఫిర్యాదు చేసిన ఉప సర్పంచ్, వార్డు సభ్యులు

**సిరిసిల్ల ప్రతినిధి,సెప్టెంబర్19( మన సాక్షి)**



రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఇల్లంతకుంట మండలం అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న వల్లంపట్ల గ్రామ సర్పంచ్ భర్త పై చర్యలు తీసుకోవాలని మంగళవారం గ్రామ ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారులు జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. వార్డు సభ్యులు లేకుండానే గ్రామ సర్పంచ్ భర్త తిర్మానాలు చేస్తున్నారని వార్డు సభ్యులు ఆరోపించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన గ్రామ పంచాయతీ వార్డ్ సభ్యులు ఉప సర్పంచ్, లబ్దిదారులు కలిసి గ్రామ సర్పంచ్ భర్త కేతిరెడ్డి వెంకట నర్సింహా రెడ్డి, గ్రామ కార్యదర్శి పై జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి కి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గ్రామంలో సర్పంచ్ కాకుండా సర్పంచ్ భర్త పెత్తనం చెలయిస్తున్నారని, వార్డు సభ్యులు లేకుండానే తీర్మానాలు చేస్తున్నారని ఆరోపించారు. ఉప సర్పంచ్ కుర్ర శ్రీకాంత్ కు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే సర్పంచ్ భర్తనే అధికారం చెలాయిస్తూ ప్రోటోకాల్ పాటించడం లేదన్నారు. వార్డు సభ్యులకు తెలియకుండా అనర్హులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇచ్చారని లబ్ధిదారులు ఆరోపించారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అర్హులైన వారికి ఇవ్వకుండా అనర్హులకు ఇచ్చిన సర్పంచ్ భర్తపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కార్యాలయం ముందు డిమాండ్ చేశారు.

# రాజాకార్ సినిమాను నిషేధించాలి

**మిర్యాలగూడ టౌన్, సెప్టెంబర్ 19, మన సాక్షి:**




బిజెపి నాయకుల సారథ్యంలో విడుదల కాబోతున్న రజాకార్ సినిమాను నిషేధించాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు ప్రపంచానికి స్ఫూర్తిదాయకంగా నిలిచిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని కులం, మతం రంగు పూస్తున్నారని ఆరోపించారు. అది వర్గ పోరు మాత్రమేనని పేదలు భూస్వాములు మధ్య జరిగిన పోరాటమని తెలిపారు. నైజాం నవాబులు పాలించిన రాజ్యంగా ఉన్నప్పటికీ పేదల పక్షాన అన్ని వర్గాల ప్రజలు విరోచితంగా పోరాడి ప్రాణాలు పోగొట్టుకున్నారని గుర్తు చేశారు. దానిని మతం మధ్య జరిగిన పోరాటంగా చిత్రీకరిస్తూ ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. వాస్తవాలను పక్కనపెట్టి అవాస్తవాలతో చిత్రీకరించి ప్రజల మధ్య విద్వేషాలు సృష్టిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం ఎన్నికల సమయంలో ఇలాంటి సినిమాలు విడుదల కావడం వల్ల ప్రజల్లో విభేదాలు వస్తాయని వెంటనే ఆ సినిమాను సెన్సార్ బోర్డు నిషేధించాలని డిమాండ్ చేశారు. ఆనాడు జరుగుతున్న పోరాటంలో ఆర్ఎస్ఎస్ నైజాం నవాబుకు అనుకూలంగా వివరించారని స్వాతంత్ర పోరాటంలో బ్రిటిష్ వాళ్లకు సహకరించారని ఆరోపించారు. తెలంగాణలో ప్రజలందరూ సమరస్యంగా జీవిస్తున్నారని ఇలాంటి ప్రజల మత విద్వేషాలు సృష్టించి రాజకీయంగా లబ్ధి పొందాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. విభేదాలు సృష్టించే సినిమాలను సెన్సార్ బోర్డు నిషేదించాలని కోరారు. పార్లమెంట్లో మహిళా బిల్లు ప్రవేశపెట్టడం శు భపరిణామమని సాకులు చూపి బిల్లు అమలు కాకుండా చూసిన, ఆటంకాలు సృష్టించిన ఊరుకోబోమన్నారు. ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న తక్షణమే మహిళా బిల్లును అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత జరగబోయే ఎన్నికల్లో ఆ రిజర్వేషన్ను అమలు చేయాలన్నారు. పార్టీ ఫిరాయింపులు లేకుండా చట్టానికి పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. రాష్ట్ర యూనిట్ గా దామాషా పద్ధతిలో ఎన్నికలు జరిపి పార్టీలకు వచ్చిన ఓట్ల ఆధారంగా సీట్లను కేటాయించాలన్నారు. దీనివల్ల ఎన్నికల వ్యయం పూర్తిగా తగ్గిపోతుందన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీరేపల్లి వెంకటేశ్వర్లు మండల కార్యదర్శి మూడవత్ రవి నాయక్, జిల్లా కమిటీ సభ్యులు డాక్టర్ మల్లు గౌతంరెడ్డి రాగిరెడ్డి మంగారెడ్డి, నాయకులు కందుకూరి రమేష్, లక్ష్మినారాయణ, రామారావు, తదితరులు పాల్గొన్నారు.



# కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సమావేశాలు జయప్రదం చేయండి

**మునగాల .మనసాక్షి. సెప్టెంబర్ 19**

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సమావేశాలు సెప్టెంబరు 28 29 తేదీల్లో ములుగు జిల్లా వాజేడు లో జరిగే సమావేశాలను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ములకలపల్లి రాములు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సుందరయ్య భవన్లో వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సమావేశం మండల అధ్యక్షుడు ఆరే రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా వారు హాజరైనారు ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులకు సమగ్ర శాసన చట్టం కై పేదలందరూ ఉద్యమించాలని పిలుపునిచ్చారు సమాజంలో నోటికి 70% గా ఉన్న కూలీలకు కనీసం తినటానికి తిండి ఉండటానికి ఇల్లు జబ్బు చేస్తే వైద్యం అందుబాటు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న కాలంలో కూలీలందరకు కనీస వేతనాలు అమలు. ఉపాధి హామీ చట్టదక్షిణకై ఉద్యమించాలని పిలుపునిచ్చారు పాలకవర్గాలు సంక్షేమ పథకాల పేరుతో అధికారంలోకి వచ్చి సంక్షేమ రంగాన్ని సమాధి చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి వ్యవసాయ కూలీకి 5000 రూపాయలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు , ప్రభుత్వం ప్రకటించిన గృహలక్ష్మి పథకాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు . సాగర్ ఎడమ కాలువ కింద పనులు లేక కూలీలు వలసలు పోతున్నారని యుద్ధపాతిగాన ఉపాధి పథకంలో కూలీలకు పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. వాజేడు లో జరిగే సమావేశంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమాన్ని నిర్మించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్టు రాములు తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ రంగ నిపుణులతో సదస్సులు సెమినార్లు జరుగుతాయని వారు తెలిపారు. ఈ యొక్క సమావేశంలో కార్మిక సంఘం మండల కార్యదర్శి సోమపంగు జానయ్య , మండల కమిటీ సభ్యులు కిన్నెర వెంకన్న, గుండు కరుణాకర్, లంజపల్లి వెంకయ్య , బచ్చలకూర సుధాకర్ ,ఆర్ లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య మహాసభ రాజకీయ కమిటీ వైస్ చైర్మన్ నియామకం

**సూర్యాపేట సెప్టెంబర్19 మనసాక్షి**

తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాజకీయ కమిటీ వైస్ చైర్మన్ గా వెంపటి వెంకటేశ్వరరావు నియామకమయ్యారు. ఈ మేరకు హైదరాబాదులోని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యాలయంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అమరవాధి లక్ష్మీనారాయణ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. వీరు గతంలో సూర్యాపేట జిల్లా ఆర్యవైశ్య మహాసభ రాజకీయ కమిటీ చైర్మన్ బాధ్యతలు నిర్వహించి ఆ పదవికే వన్నెతేవడంతో పాటు ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదుగుటకు తమ వంతు కృషి చేశారు. తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాజకీయ కమిటీ వైస్ చైర్మన్ గా నియామకమైన సందర్భంగా పలువురు జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాపై నమ్మకంతో రాజకీయ కమిటీ వైస్ చైర్మన్ నియమించినందుకు అమరవాది లక్ష్మీనారాయణకు, సహకరించినందుకు సూర్యాపేట జిల్లా అధ్యక్షులు మా శెట్టి అనంతరాములకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తెలిపారు. ఆర్యవైశ్యులు సామాజిక వ్యాపార రంగంతో పాటు రాజకీయరంగంలో సైతం రాణించే విధంగా తన కృషి కృషి చేస్తానని తెలిపారు.

# మేముసైతం యూత్ ఆర్థిక సహాయం

**లక్షెట్టిపేట్, సెప్టెంబర్ 19 (మన సాక్షి)బీ**



లక్షేట్టి పేట ముస్సిపాలిటీ పరిధిలోని ఒకటవ వార్డుకు చెందిన సత్యసాయినగర్ కాలనీ వాసుడు బోడ శివాజీ అనే వ్యక్తికి ఇటీవల రోడ్డు ఆక్సిడెంట్ లో చాలా తీవ్రమైన గాయాలయ్యాయి. లేవలేని స్థితిలో ఉన్నాడు. వారి కుటుంబ పరిస్థితి బాగా లేకపోవడం తో దారి ఖర్చులకు కూడా చాలా ఇబ్బందిగా ఉందని వారు మేముసైతంను సంప్రదించడం జరిగింది.వారి కుటుంబ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని మా వంతు సహాయం గా అతని భార్యకు మంగళవారం రోజున ఐదువేల రూపాయలు ఆర్థిక సహాయం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు ఎంబడి తిరుపతి, సభ్యులు పెట్టేం నరేష్, రమేష్, కిట్టు, మహేష్, సతీష్, వినోద్, మల్లేష్, రాకేష్, మల్లేశం, ఫారుక్, వెంకటేష్, నగేష్, శ్రీనివాస్, రాజేష్ లు పాల్గొన్నారు.

# తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం

అర్వపల్లి సెప్టెంబర్ 19 మన సాక్షి



తెలంగాణ రాష్ట్రంలో త్వరలోనే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని సోనియాగాంధీ ప్రకటించిన 6 గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు తుంగతుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే ఆశావః అభ్యర్థి భాష ప%శీ%గు భాస్కర్ ఆ న్నారు.
మంగళవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, హైదరాబాదులో నీ తుక్కుగూడలో నిర్వహించిన కాంగ్రెస్ విజయభేరి సభను విజయవంతం చేసిన కాంగ్రెస్ కార్యకర్తలకు అభినందనలు తెలియజేశారు 125 సంవత్సరాల చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ సి డబ్ల్యు సి సమావేశం తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటు చేయడం మొట్టమొదటి సమావేశమును అన్నారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు మన రాష్ట్రంలో సమావేశం ఏర్పాటు చేసి కాంగ్రెస్ పార్టీ త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్న భరోసా కల్పించారానీ అన్నారు.
విజయ బేరి సభలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన గ్యారంటీ హామీలను కచ్చితంగా అమలు చేస్తామని ఇచ్చిన మాట నిలబెట్టుకునే దమ్ము ధైర్యం సోనియా గాంధీకి ఉందని అన్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యే నియోజకవర్గానికి వలస పక్షి అని ఇక్కడ ఉన్న ఆర్థిక వనరులు ఇసుక మాఫియా ల్యాండ్ మాఫియా వైన్ మాఫియా ద్వారా కొట్లాది రూపాయలను సంపాదించుకొని ఉన్న ఊరుకు తరలిపోతాడని అన్నారు.తుంగతుర్తి నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థులనే గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ఆంధ్ర తెలంగాణ రెండు రాష్ట్రాలలో కూడా భారీ నష్టం వస్తుందని తెలిసి కూడా సోనియాగాంధీ సకల జనుల సమ్మెను యువత ఆత్మ త్యాగాలను చూచి తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఇచ్చిన హామీలను మర్చిపోయిన కేసీఆర్ సోనియాగాంధీని విమర్శించే అర్హత లేదని అన్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నుండి సరైన అభ్యర్థి రంగంలోకి వస్తాడని అందరు కూడా సహకరించి భారీ మెజారిటీతో గెలిపించుకుందామని అన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రెహమాన్ విజయ్ ,అనుదీప్ ,రాజు, అనిల్, పాల్గొన్నారు

# నీచమైన పాలనకు చమరగీతం పాడాలి..

## ఆత్మ అభిమానం ఉన్న పార్టీ కాంగ్రెస్

## ఏఐసిసీ సభ్యుడు మహేష్ శర్మ

దుబ్బాక, సెప్టెంబర్ 19, మనసాక్షి :



దేశంలో, రాష్ట్రంలో నీచమైన పాలన సాగుతుందని, ఆత్మ అభిమానం ఉన్న ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని ఏఐసీసీ సభ్యులు మహేష్ శర్మ అన్నారు. సోమవారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద కత్తి కార్తిక గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ఆత్మ అభిమానం ఉన్న పార్టీ అని, కార్యకర్తల బాగోగులు తీర్చే పార్టీ అని అన్నారు. దేశంలో మోడీ సర్కారు, రాష్ట్రంలో కెసిఆర్ సర్కారు నిజమైన పాలన సాగిస్తుందని ఈ పాలనకు చమర గీతం పాడాలని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేసి సోనియమ్మ రుణం తీర్చుకోవాలని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇంద్రమ్మ రాజ్యాన్ని తెచ్చుకుందామని స్పష్టం చేశారు. తెలంగాణ ఏర్పాటు విషయంలో సోనియా గాంధీ ఒక తల్లిగా ఆలోచించిందని ఆత్మ బలిదానాలు అర్థం చేసుకున్న తల్లి సోనియా గాంధీ అని అన్నారు. ఇతర పార్టీలకు ఆత్మ అభిమానం లేదు అని ఓట్ల కోసమే పనిచేసే పార్టీలోని అన్నారు. నాడు వ్యవసాయం దండగ ఉండేదని... కాంగ్రెస్ పార్టీ వ్యవసాయం పండగల చేసిందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే బీడీ కార్మికులకు 2500 పింఛన్, మహిళలకు 500 కే వంటగ్యాస్, రైతు భరోసా పేరుతో ఎకరాకు 15000 రూపాయలు, కౌలు రైతులకు 12000, ఇంటి స్థలం తో పాటు ఇల్లు నిర్మాణం కోసం ఐదు లక్షలు మంజూరు చేస్తుందని, నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 5 లక్షల నుండి పై చదువుల కోసం విద్యార్థులకువిద్యార్థి భరోసా పథకం, ఇంట్లో ఇద్దరికి పింఛన్ సౌకర్యం, 10 లక్షల ఆరోగ్యశ్రీ పథకాన్ని అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే అమలు చేస్తుందని అన్నారు. ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకునేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని అన్నారు. దుబ్బాక గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగర వేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కర్నాల శ్రీనివాసరావు, ఎల్లం, ఐరన్ సాయి తేజ గౌడ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలి

## పరిరక్షణ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెగ్గెల రాజు

నాగిరెడ్డిపేట్, సెప్టెంబర్ 19, మన సాక్షి:-



సమాచార హక్కు చట్టం గురించి ప్రతి ఒక్కరు తెలుసుకొని దానిని వినియోగించుకోవాలని సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెగ్గల రాజు అన్నారు. మంగళవారం మండలంలోని తాండూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమాచార హక్కు చట్టం-2005 పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ఒక బ్రాహ్మాస్త్రం లాంటిదని, ప్రతిఒక్కరూ సమచార హక్కు చట్టాన్ని వినియోగించుకోవాలన్నారు. అధికారులు సెక్షన్ 6(1) ప్రకారం ధరఖాస్తు చేస్తే 30 రోజులలో సమాచారం ఇవ్వాలన్నారు. 30 రోజులలో కోరిన సమాచారం ఇవ్వని యెడల మొదటి అప్పీల్ చేయవచ్చునని, మొదటి అప్పీల్ కు దరఖాస్తు చేసేటప్పుడు మొదటి దరఖాస్తు రిసీవ్డ్ కాపీని జత చేసి మొదటి అప్పీల్ కు దరఖాస్తు చేయాలన్నారు. చేసిన 45 రోజులలో దరఖాస్తు చేసుకున్న వ్యక్తులకు సమాచారం ఇవ్వటం జరుగుతుందని, 45 రోజులలో సమాచారం ఇవ్వని యెడల రెండవ అప్పీల్ నేరుగా రాష్ట్ర సమాచార కమిషన్ కు దరఖాస్తు చేసుకోవచ్చునని సమాచార కమిషనర్ నేరుగా అధికారి నుండి సమాచారం తీసుకొని దరఖాస్తు దారునికి ఇవ్వడం జరుగుతుందన్నారు. స.హా చట్టం ద్వారా ప్రతీ ప్రభుత్వ కార్యాలయంలోని వివరాలు, కావాల్సిన సమాచారం సేకరించవచ్చునని, ప్రవేట్ కార్యాలయాల్లో కూడా సమాచారం సేకరించవచ్చునని, స.హా చట్టం ఒక బ్రహ్మాస్త్రం లాంటిది ప్రతిఒక్కరూ సమాచార హక్కు చట్టం సద్వినియోగం చేసుకోవాలని ఇంత గొప్ప చట్టం ఇంకొక్కటి లేదని చట్టం ద్వారా అవినీతిని నిర్మూలించవచ్చని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, జిల్లా ఈసీ సభ్యులు లింగమయ్య పాల్గొన్నారు.

# పోలీసు అధికారుల ప్రత్యేక చోరవతో పెండింగ్ కేసుల్లో పురోగతి

## జిల్లా ఎస్పీ అధికారులను అభినందించిన డిజిపి

జగిత్యాల ప్రతినిధి,సెప్టెంబర్19,(మన సాక్షి)



రాష్ట్రంలో క్రైమ్, ఫంక్షనల్ వర్టికల్స్, సైబర్ క్రైమ్ లపై పోలీస్ కమీషనర్లు, ఎస్.పి. లతో డిజిపి అంజనీ కుమార్ ఐపీఎస్ మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నేర సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ పెండింగ్ కేసులు, క్రైమ్ ఎగినెస్ట్ ఉమెన్ ,ఎస్సీ ఎస్టీ ,గ్రెవ్ కేసులపై పోలీస్ అధికారులు తీసుకొన్న ప్రత్యేక చోరవతో పెండింగ్ కేసుల్లో పురోగతి సాధించారని అన్నారు. సమాజంలో నేరం చేసిన వారు ఎవరూ శిక్షల నుండి తప్పించుకొలేరనే భావన నేరస్తులు కలిగించాలని సూచించారు. ఈ సంవత్సరం రాష్ట్రంలోని వివిధ న్యాయస్థానలో 135 కేసుల్లో జీవిత ఖైదులు విధించడం జరిగిందని తెలిపారు.గడిచిన 2022 సంవత్సరంలో జగిత్యాల జిల్లాలో హత్యలకు సంబంధించి ఒకే జీవిత ఖైదు విధించగా 2023 సంవత్సరం జిల్లా పోలీసులు తీసుకున్న ప్రత్యేక చర్యల వల్ల హత్యలకు సంబంధించి 10 కేసుల్లో 16 మందికి జీవిత ఖైదీపడేలా కృషి చేసిన జిల్లా ఎస్పీని అదేవిధంగా అధికారులను, సిబ్బందిని డిజిపి అభినందించడంతో పాటు ఇదే స్పూర్తితో భవిష్యత్తులో పని చేయాలన్నారు. ఈ యొక్క వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా ఎస్పీ ఎగ్గడి భాస్కర్ అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు, డీఎస్పీ లు వెంకటస్వామి, రవీంద్ర కుమార్, రవీంద్ర రెడ్డి, ,సీసీఎస్ డీసీఆర్బీ ఐటీ కోర్ ఇన్స్పెక్టర్ లు వెంకటేశ్వర్లు, రాజారెడ్డి, రఫీక్ ఖాన్,సి ఐరమణమూర్తి, డీసీఆర్బీ సిబ్బంది పాల్గొన్నారు.

# వినాయక చవితి ఉత్సవాలలో డీజేలను వాడినట్లైతే కఠిన చర్యలు తప్పవు

## - లక్షెట్టిపేట ఎస్సై లక్ష్మణ్

లక్షేట్టిపేట్ సెప్టెంబర్ 19 (మన సాక్షి)బి



వినాయక చవితి ఉత్సవాల్లో డీజేలను వాడినట్లయితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని లక్షేట్టిపేట ఎస్సై ఎస్.లక్ష్మణ్ డీజే నిర్వాహకులకు హెచ్చరించారు. మంగళవారం రోజున లక్షేట్టిపేట మండలలోని డీజే నిర్వాహకులను పోలీస్ స్టేషన్ కు పిలిపించి వారికి కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగింది. పోలీస్ శాఖ నిబంధనల మేరకు వినాయక చవితి ఉత్సవాలలో డీజేలను నిషేధించడం జరిగిందని నిర్వాహకులకు ఎస్సై వివరించారు. ఎక్కడైనా డీజేలు నిర్వహించినట్లు కనిపించినట్లయితే కఠిన చర్యలతో పాటు డిజెలను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. ముందస్తు చర్యలలో భాగంగా 14 మందిని డిజె నిర్వాహకులను తహసిల్దార్ ఎదుట బైండోవర్ చేశారు.

# అధికారుల నిర్లక్ష్యమే ఆమెకు శాపం

మర్రిగూడ, సెప్టెంబర్ 19:మన సాక్షి



అధికారుల నిర్లక్ష్యమే ఆమె పాలిట శాపం అయింది. నిలువ నీడలేని బాధితురాలు గృహ లక్ష్మీ పథకం కింద తనకు ఇల్లు వస్తుందని గంపడాశతో ఉన్న ఆమెకు నిరాశే ఎదురయింది. ఊరంతా ఆమెకు ఇల్లు ఇస్తే బాగుండని అనుకున్న.. అధికారుల తప్పిదం వల్ల అనర్హురాలుగా మారింది. వివరాలలోకి వెళితే... నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని తమ్మడపల్లి గ్రామానికి చెందిన దళిత మహిళ జిల్లా సుజాత గృహలక్ష్మి పథకానికి పూర్తి వివరాలతో దరఖాస్తు ఫారాన్ని నింపి తాసిల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంది. అధికారులు గ్రామానికి వచ్చి వివరాలను కూడా పరిశీలించి సరిగానే ఉన్నాయని నిర్ధారించుకున్నారు. దరఖాస్తుదారు వివరాలను ఆన్లైన్లో నమోదు చేయడంలో మండల పరిషత్ అధికారులు నిర్లక్ష్యం చేశారు. లిస్టులో ఆమె పేరు రాకపోవడంతో బాధితురాలు సుజాత తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకున్నానని, తన పేరు లిస్టులో లేకపోవడం ఏందని ఆమె విచారం వ్యక్తం చేసింది. అధికారులు తప్పిదం వల్లనే తనకు అన్యాయం జరిగిందని ఆరోపించింది. తనకు న్యాయం జరిగేలా ప్రజాప్రతినిధులు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రాధేయపడింది. ఈ విషయమై ఎంపీడీవో వెంకటేశ్వరరావును, మన సాక్షి వివరణ కోరగా ఏదో తప్పిదం వల్ల దరఖాస్తు ఫారం మిస్ అయినట్టు ఉందని.. మరొకసారి పరిశీలన చేసి ఆన్లైన్ చేసేందుకు చర్యలు తీసుకుంటానని వెల్లడించారు.



# ఇంటింటికి త్రాగునీరుఎమ్మెల్యే రెడ్డి శాంతి

మెలియాపుట్టి. సెప్టెంబర్ 19. మన సాక్షి.

రాష్ట్ర ప్రభుత్వం జలజీవన్ మిషన్ పథకము ద్వారా ఇంటింటికి కులాయిల ద్వారా త్రాగునీరు అందించేందుకు నిధులు మంజూరు చేసిందని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మంగళవారం మెలియాపుట్టి మండల కేంద్రంలో జల జీవన్ మిషన్ పథకం కు సంబంధించిన మెటీరియల్స్ ఎమ్మెల్యే పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మెలియాపుట్టి మండలము కు సంబంధించి 83 గ్రామాలకు 12..65 కోట్ల రూపాయలతో కుళాయిల ద్వారా ఇంటింటికి మంచినీటి సరఫరా చేసేందుకు నిధులు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ఎమ్మెల్యే రెడ్డి శాంతి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా అధికారులతో ఈ పథకము ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఆర్డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. ఆమెతోపాటు ఎంపీపీ ప్రతినిధి బైపోతు ఉదయ్ కుమార్, జడ్పిటిసి గూడ ఎండయ్య, పిఏసిఎస్ అధ్యక్షులు బాలరాజు, వైసిపి మండల కన్వీనర్ పల్లి యోగి,ఎంపీటీసీ ప్రతినిధి పోలాకి జయమునిరావు, కరణం శశిభూషణ్ రెడ్డి, పలువురు వైసిపి నేతలు, ఎంపీడీవో చంద్రకుమారి, ఏవో తిరుపతి పట్నాయక్, పలువురు అధికారులు ,తదితరులు పాల్గొన్నారు.

# చెల్లాపూర్ లో ఉచిత ఆరోగ్య శిబిరం

## - కౌన్సిలర్ గోనేపల్లి

దుబ్బాక, సెప్టెంబర్ 19, మనసాక్షి :



ఉచిత ఆరోగ్య శిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని రెండోవ వార్డు కౌన్సిలర్ గోనేపల్లి దేవలక్ష్మీ-సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా దుబ్బాక మునిసిపల్ చెల్లాపూర్ లో సిఎస్సి హెల్త్ కేర్ ఆధ్వర్యంలో వార్డు కాచిర్ వద్ద 56 రకాల ఉచిత రక్త పరీక్షలు, మూత్రపరీక్షలు చేపించడం జరిగింది కౌన్సిలర్ గోనేపల్లి దేవలక్ష్మీ-సంజీవరెడ్డి మాట్లాడుతూ... లేబర్ కార్డ్ ఉన్న ప్రతి కార్మికులు వారి కుటుంబ సభ్యులతో రక్త పరీక్షలు తో తదితర పరీక్షలు చేపించుకోవాలి అని అన్నారు ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది డి.సి బాబు ,సి సి నవీన్ ,శివ,నరేష్,శ్రీను,సోనీ పలువురు నాయకులు, యువత స్వామి, శ్రీకాంత్, కరుణాకర్, తిరుపతి బిఆర్ ఎస్ కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పేటలో ప్రారంభమై మహాగణపతి బ్రహ్మోత్సవాలు.

నారాయణపేట టౌన్, సెప్టెంబర్ 19 మన సాక్షి:-



స్థానిక సుభాష్ రోడ్డు లోని శ్రీ సంత్ మఠ్ మూల మహా సంస్థానం శక్తిపీఠంలో మంగళవారం శక్తిపీఠం శ్రీ మహాగణపతి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు . జ్ఞాన యజ్ఞముతో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టడం జరిగింది. మహా యజ్ఞముతో యజ్ఞంలో భాగంగా బ్రహ్మ శ్రీ కులకర్ణి రామ్మోహన్రావు ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. శక్తిపీఠం ధర్మకర్త గుడిపల్లి రాఘవేంద్ర రెడ్డి దంపతులు శ్రీ మహాగణపతి హోమంలో పాల్గొన్నారు. స్మార్త పండితులు ముట్నూరు పురోహిత్ అగ్నిహోత్రి ఆధ్వర్యంలో అంతకుముందు సుప్రభాత సేవ, నిర్మాల్యము, పీఠపూజ, అర్చన, హోమము, లఘు పూర్ణాహుతి , మహా నివేదన , మహా మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించారు. 723 సంవత్సరాల నిమజ్జమే నిమజ్జనం ఎరుగని మట్టి వినాయకుడు శక్తిపీఠం లో కొలువై ప్రత్యేక ఆకర్షణగా నిలువగా భక్తులు దర్శించుకుని శ్రీ వరసిద్ధి వినాయక మూలవిరాట్ పూజానంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. మంగళవారం జరిగిన కార్యక్రమాలకు లయన్ ఆత్మరాం ఎక్కే ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో శక్తి పీఠం సభ్యులు , భక్తులు, మహిళలు మహిళలు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## స్వయం ఉపాధి తో యువత ఆర్థికంగా బలోపేతం కావాలి

**రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు ప్రతినిధి సెప్టెంబర్ 19 మనసాక్షి:**



యువత తమకు అందివచ్చిన అవకాశాలను ఉపయోగించు కుంటూ తమ నైపుణ్యాలను మెరుగు పర్చుకొని స్వయం ఉపాధి రంగాలలో స్థిరపడి ఆర్థికంగా బలోపేతం కావాలని బిఆర్ఎస్ పార్టీ మైనారిటీ నాయకులు సయ్యద్ ఖలీల్ తెలిపారు. తమకు నచ్చిన రంగాలలో వృత్తి పరమైన రంగాలలో ఎదగాలన్నారు. ఆమనగల్లు పట్టణంలో అజయ్ బ్రాస్ బ్రాండ్ షాప్ ను సయ్యద్ ఖలీల్ ముఖ్యఅతిథిగా హాజరై, ప్రారంభించారు. ఈ సందర్భంగా షాప్ రెగులర్ గా కస్టమర్ లతో లాభదాయకంగా నడవాలని కోరుకుంటూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాండు నిర్వాహకులు సురేష్ సమీర్,జగన్,సిద్ధు, యాదగిరి, ప్రవీణ్, పవన్, మున్సిపాలిటీ నాయకులు. ఎం వెంకటయ్య, చలిచీమల సతీష్ ,మత్తయ్య. వసుపుల రంజిత్, జంతుక శివ,అఫ్రోజ్, పాల్గొన్నారు.

## చంద్ర బాబు నాయుడు ను బేషరతుగా విడుదల చేయాలి.

**నారాయణపేట టౌన్, సెప్టెంబర్ 19, మనసాక్షి:-**



ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ను విడుదల చేయాలని తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక పళ్ల విధి లోని 700 సంవస్తారాలు నిమజ్జమెరుగని వినయకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. టి.డీ.పి. రాష్ట్ర నాయకుడు ఓం ప్రకాశ్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో జగన్ ఓడిపోతాడనె భయంతో చంద్రబాబు పై కక్ష సాధింపు తో జైలుకు పంపాడని, స్కిల్ డెవలప్మెంట్ లో 2 లక్షల 40 వేల మంది శిక్షణ పొంది ఉద్యోగాలు చేస్తున్నారని స్వచ్ఛమైన పాలన అందించిన నాయకుడని మాజీ ముఖ్యమంత్రి అని 900చూడకుండా,ఎలాంటి నోటీస్ ఇవ్వకుండా అక్రమంగా అరెస్ట్ చెయడం సమంజసం కాదని వెంటనే బేషరతుగా విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మొగులప్ప, యాబన్న చౌదరి, వీరన్న, వధి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పలువురు బిఆర్ఎస్ పార్టీలో చేరిక

**జగిత్యాల ప్రతినిధి, సెప్టెంబర్19,(మన సాక్షి)**



జగిత్యాల రూరల్ మండలం గుల్లపేట గ్రామానికి చెందిన 15 మంది విశ్వ బ్రాహ్మణ సంఘం సభ్యులు బిఆర్ఎస్ పార్టీ అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఎమ్మెల్యే క్వార్టర్స్ లో పార్టీలో చేరగా స్థానిక ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ బిఆర్ఎస్ పార్టీలోకి కండువా కప్పి వారిని ఆహ్వానించారు. బిఆర్ఎస్ పార్టీలో చేరిన వారిలో భీమన్న, లక్ష్మినారాయణ చంద్ర మౌళి, సంఘ సభ్యులు చేరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజేంద్రప్రసాద్ ,సర్పంచ్ జక్కుల తిరుపతి, ఎంపీటీసీ సురేందర్ రెడ్డి,సీనియర్ నాయకులు దమ్మా రాజీ రెడ్డి,తిప్పర్తి నరేష్,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తడ్కల్లో" బీఆర్ఎస్ లో చేరికలు జోరు"

### - మంత్రి సమక్షంలో పార్టీలో చేరికలు

**కంగ్టి, సెప్టెంబర్ 19, మన సాక్షి:-**



సంగారెడ్డి జిల్లా నూతన తడ్కల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో వలసలు జోరుగా కొనసాగుతున్నాయని మంత్రి హరీష్ రావు, ఎమ్మెల్యే మహా రెడ్డి భూపాల్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి గులాబి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్ పర్సన్ మంజుశ్రీ , బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు గంగారం, ఎంపీపీ సంగీత వెంకటరెడ్డి, జడ్పిటిసి కోట లలిత ఆంజనేయులు సర్పంచ్ గడ్డపు మనోహర్, ఆత్మ కమిటీ డైరెక్టర్ రమేష్, సొసైటీ డైరెక్టర్ హనుమంత్ రెడ్డి, నాయకులు సత్యనారాయణ బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## రాబోయే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమే

### - మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రామ్మోహన్ రెడ్డి

**కుల్కచర్ల, 19 సెప్టెంబర్ మన సాక్షి:**

తుక్కుగూడ లో జరిగిన భారీ బహిరంగ సభ లో సోనియా గాంధీ డిక్లరేషన్ కి ఆకర్షితులు అయి ముజాహిద్పూర్ లో బిఆర్ఎస్ పార్టీకి చెందిన కొందరు కార్యకర్తలు గ్రామ సర్పంచ్ లక్ష్మీ ఆనంద్, మండల అధ్యక్షులు బిఎస్ ఆంజనేయులు మరియు వార్డు మెంబర్ ముసలి వెంకటేష్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రామ్మోహన్ రెడ్డి సమక్షంలో కాకి వెంకటయ్య, తీయల బాలరాజ్, మేకల వెంకటేష్, మేకల మల్లేష్, మేకల శివ, ముసలి మల్లేష్, సందని శివకుమార్, ముసలి రవి, తీగల శేఖర్ లకు పార్టీ కండువాలు వేసి కాంగ్రెస్ పార్టీలోకి ఘనంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.... కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన యూత్, మహిళ, వృద్ధాప్య, వితంతు, నిరుద్యోగ డిక్లరేషన్ చూసి పార్టీలోకి రావడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో పు లింగ వెంకటేష్, గ్రామ అధ్యక్షుడు షర్ఫుద్దీన్, సోషల్ మీడియా కన్వీనర్ భీమ్ భాస్కర్, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# దౌల్తాబాద్ పద్మశాలి సంఘం ఎన్నిక

**హత్నూర, సెప్టెంబర్ 19,మన సాక్షి:**



హత్నూర మండలం దౌల్తాబాద్ శ్రీ మార్కండేయ పద్మశాలి సంఘం జరిగిన సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది.
అధ్యక్షులు:– తుమ్మలపల్లి సత్యనారాయణ
కార్యనిర్వాహక అధ్యక్షులు:– బిట్ల మహేష్
ఉపాధ్యక్షులు:– పొన్న జనార్ధన్ , నూకల రవీందర్ , కుంటల శ్రీనివాస్ , మారేపల్లి లక్ష్మణ్ , కొంపల్లి ప్రభాకర్ , మంగాపురం సురేష్ ,
ప్రధాన కార్యదర్శి:– బిట్ల రామస్వామి , సహాయ కార్యదర్శులు:– గంజి శివశంకర్ , బాయిని సత్యనారాయణ , చింతల్ చెర్వు ఆనంద్ కుమార్ గారు, కొంపల్లి రాము , గుండ వినయ్ కుమార్ ,
కోశాధికారి:– కూచి శ్రావణ్ కుమార్ , సహాయ కోశాధికారి:– గంజి భాస్కర్
గౌరవ సభ్యులు:– చింతల్ చెర్వు ప్రవీణ్ కుమార్, వనమాల రాందాస్ , పొన్న సతీష్ , గుండ మధుసూదన్ , సబ్బని నర్సింలు , అరిగె పెంటయ్య , అరిగె బాల్ రాజు , చింతల్ చెర్వు అరవింద్ కుమార్ , గుంజరి వెంకటేశం , అరిగె కిరణ్ కుమార్, దార నర్సింలు , గుర్రపు శ్రీకాంత్ , పాముల వెంకటేశం , అరిగె శేఖర్ , కామిని అరుణ్ కుమార్ , బామిని బాల్ రాజు , మచ్చ వెంకటేశం , చింతల్ చెర్వు శేఖర్, తుమ్మలపల్లి ప్రభు . సలహాదారులు:– అరిగె శ్రీనివాస్ , పాలడుగు మధు , కోట గంగారాములు, అరిగె యాదగిరి , అరిగె చిన్న వెంకటేశం , అరిగె లక్ష్మణ్, గుండ పురుషోత్తం లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది .

## వాహనాల వేలం

**నారాయణపేట టౌన్, సెప్టెంబర్ 19, మనసాక్షి :-**

నిషేధింపబడ్డా వాహనాలను తేది 21-09-23 గురువారం రోజు వేలం నిర్వహిస్తున్నట్లు జిల్లా రవాణా శాఖాధికారి వీర స్వామి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆర్.టి.సి బస్సు డిపో లో 13, అమాపక కేంద్రంలో 07, రవాణా శాఖాధికారి కార్యాలయంలో 11, మొత్తం 31, వాహనాలను గురువారం రోజు 11 గంటలకు వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున ఆసక్తి గల వారు సంప్రదించి వేలంలో పాల్గొనగలరని రవాణా శాకాదీకారి తెలిపారు.



## అంగన్వాడీలను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలి

**కొడంగల్, సెప్టెంబర్ 19, మన సాక్షి.**

కొడంగల్ నియోజకవర్గం, నారాయణపేట జిల్లా, కోస్గి మండలం అంగన్వాడీ టీచర్లు , డిమాండ్. చేశారు. ఏఐటియుసి,సిఐటియు,జేఏసీ సంఘాలు ఇచ్చిన రాష్ట్ర వ్యాప్త నిరవధిక సమ్మె పిలుపులో భాగంగా మంగళవారం నాడు కొస్గి మండల కేంద్రంలాలో అంగన్వాడీలు చేస్తున్న 9 వ రోజు సమ్మె రిలే నిరాహార దీక్షలో అంగన్వాడీ టీచర్లు, విజయలక్ష్మి చంద్రకళ, భారతి, పద్మ,పాల్గొని వారి ఉద్దేశించి మాట్లాడారు. గత 48 సంవత్సరాల నుండి ఐసిడిఎస్ లో తెలంగాణ రాష్ట్రంలో 70000 మంది అంగన్వాడి ఉద్యోగులు చాలీచాలని వేతనాలు తీసుకుంటూ పేద ప్రజలకు సేవలు అందిస్తున్నారని అన్నారు. వీరిని రాష్ట్ర ప్రభుత్వం కట్టు బానిసల్ల వెట్టిచాకిరి చేయిస్తూ శ్రమ దోపిడికి గురి చేస్తుందని. వీరందరినీ షరతులు లేకుండా పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు బెదిరింపులు మానుకొని రాష్ట్ర ,జేఏసీ నాయకత్వాన్ని చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని అన్నారు. కనీస వేతనం 26000 చెల్లించాలని, పింఛన్ ఈఎస్ఐ పీఎఫ్ వర్తింపజేసి ఇతర సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రాట్యూటీ అమలు చేయాలని,ఉద్యోగ విరమణ అనంతరం టీచర్లకు పది లక్షలు,ఆయలకు ఐదు లక్షలు చెల్లించాలని ,ఉద్యోగ విరమణ వయసు 65 ఏళ్లకు పెంచాలని,వారికి ఐదు లక్షల ప్రమాద బీమా అమలు చేయాలని ఉద్యోగ పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. పిల్లలకు ఐదు రూపాయలు,గర్భిణులు బాలింతలకు పది రూపాయల చొప్పున ఆరోగ్య లక్ష్మి మెనూ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ లక్ష్మి ,మంజుల,సుజాత,అనురాధ , ప్రమీల విజయలక్ష్మి రాజేశ్వరి,రాధిక,భాగ్యలక్ష్మి,బసవలింగమ్మ, వెంకటమ్మ, ఉమాదేవి,మణెమ్మ,శ్రీలత తిరుపతమ్మ, కొస్గి అంగన్వాడీ టీచర్స్ మరియు హెల్పర్స్ తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

**నారాయణపేట టౌన్, సెప్టెంబర్ 19 మన సాక్షి:-**

సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులు అందరిని విద్యాశాఖలో విలీనం చేసి శాశ్వత ఉద్యోగులుగగుర్తించాలని, కనీస వేతనం అమలు చేయాలని చేస్తున్న దీక్షలు నేటితో 14వ రోజుకు చేరాయి సమగ్ర శిక్ష ఉద్యోగులు నారాయణపేట మున్సిపల్ పార్క్ ధర్నా సెంటర్లో దీక్షలు చేస్తున్నారు. మంగళవారం శిబిర%శీ%లో కేసీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి, మమల్ని రెగ్యులర్ చేయండి అని భజనలు చేస్తూ కేసీఆర్ విన్నవించడం జరిగింది.
మేము గత 15సంవత్సరాలుగా చాలీచాలని జీతాలతో ఇందులో పనిచేస్తున్నాము. మమల్ని విద్యా శాఖలో విలీనం చేసి వారికి మినిమం టైం స్కెల్ అందించాలని మేము కోరుతున్నాము
ఈ దీక్షలో సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులందరం పాల్గొనడం జరిగింది నేటి కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షులు ఎల్లగౌడ్ ,రాజశేఖర్ అరుణ, మహేష్ , ఉమా, వనిత,మధు, రత్నమల, సరస్వతి, శశికాంత్, ధర్మన్న, వనిత,నర్సప్ప, నిస్సర్, తిమ్మప్ప, జగదీష్, వెంకటనారాయణ్, నర్సిములు,మిగతా సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.



## బీఆర్ఎస్ పార్టీ గెలుపుకు గెలుపు గుర్రాల పని చేయాలి

### - ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి

**కుల్కచర్ల, 19 సెప్టెంబర్ మన సాక్షి:**

స్థానిక ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు కల్వకుంట్ల చంద్రశేఖర రావు ఆదేశాల మేరకు బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా ఇన్చార్జిలకు తన నివాసంలో మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా మహేష్ రెడ్డి మాట్లాడుతూ..... పార్టీ సంక్షేమ పథకాలను, అభివృద్ధిని ప్రజల వద్దకు తీసుకుపోవడానికి సోషల్ మీడియా ఇన్చార్జిల పాత్ర కీలకమైందని పేర్కొన్నారు. పార్టీ గెలుపు కోసం కీలుగుర్రాలుగా పనిచేయని అన్నారు. అనంతరం సోషల్ మీడియా ఇన్చార్జిలు మాట్లాడుతూ.... పార్టీ గెలుపు కోసం క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల కు సంక్షేమ పథకాల గురించి అవగాహన కల్పించి వాటి పట్ల క్లుప్తంగా వివరిస్తామని అన్నారు. పార్టీ గెలుపుకు ఎక్కువ మొగ్గు చూపేటట్లుగా ప్రజలను తయారు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాగని బిచ్చన్న, పరిగి అశోక్ సోషల్ మీడియా ఇన్చార్జులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా బిల్లు లో బీసీ రిజర్వేషన్ అమలు చేయాలి.

**నారాయణపేట టౌన్, సెప్టెంబర్ 19 మన సాక్షి:-**

మహిళ బిల్లులో బీసీ రిజర్వేషన్ అమలు చేయకపోతే దొరలు పోయి... దొరసానుల పాలన వస్తుందని సామాజిక కార్యకర్త గవినోళ్ళ శ్రీనివాస్ ఆవేదన వ్యక్తంచేశారు. ఆలా అయితే అణగారిన వర్గాల మహిళలకు లాభం లేని బిల్లు అవుతుందని ఆయన విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న మహిళా బిల్లు పట్ల సంతోషం వ్యక్తం చేశారు సామజిక కార్యకర్త గవినోళ్ల శ్రీనివాస్. కేంద్రం తెస్తున్న చట్టం లో మహిళల కు చట్ట సభల్లో 33% రిజర్వేషన్ లు కల్పించడం చాలా సంతోషం ఈ చట్టం కోసం భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ, కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద మహిళా రిజర్వేషన్ కోసం నిర్వహించిన ధర్నా లో పాల్గొనడం జరిగింది అని ఈ సందర్భంగా తెలిపారు, కానీ ఈ బిల్లు లో అన్ని వర్గాల మహిళలకు న్యాయం జరగాలి, సామజిక న్యాయం పాటించాలి అంటే తప్పకుండ ఈ బిల్లు లో బీసీ రిజర్వేషన్స్ అమలు చేయాలి, రాజ్యాగం ప్రకారం ఎలాగూ దళిత, గిరిజనులకు చట్ట సభల్లో రిజర్వేషన్స్ ఉన్నాయి కాబట్టి, బీసీ మహిళలకు ఈ బిల్లు లో రిజర్వేషన్స్ ఇస్తే ఈ దేశం లోని చట్ట సభల్లో అన్ని వర్గాలకు అవకాశం కల్పించినట్టు అవుతుంది, ఆలా చేయక పోతే దొరలు పోయి, దొరసానులు వస్తరు .తప్ప నిజమైన సామజిక న్యాయం జరగదని ఈ సందర్భంగా గవినోళ్ల పేర్కొన్నారు, కాబట్టి కేంద్రం వెంటనే చొరవ చూపి ఈ మహిళా బిల్లు లో బీసీ మహిళ లకి రిజర్వేషన్స్ పెట్టాలి ఆయన కోరారు.

## ఫొటో సిమిలర్ ఎంట్రీ సమర్థవంతంగా నిర్వహించాలి.

### కలెక్టర్ కోయ శ్రీ హర్ష.

**నారాయణపేట టౌన్, సెప్టెంబర్ 19, మనసాక్షి:-**



ఫొటో సిమిలర్ ఎంట్రీ సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఎన్నికల సిబ్బందికి ఆదేశించారు. మంగళవారం ఆర్.డీ.ఓ. కార్యాలయం ను సందర్శించిన జిల్లా కలేక్టర్ ఫారం–6 ద్వార ఎన్ని దరఖాస్తులు వచ్చాయి,వాటిని ఆన్లైన్ లో పొందుపర్చాలని ఆదేశించారు. మంగళవారం చివరి రోజు ఉన్నందున ఎన్ని దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. డబుల్ ఎంట్రీ ఉంటె ఒకసారి చెక్ చేసుకోవాలని కలేక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్.డీ.ఓ. రామచందర్, తహసిల్దార్ రానప్రతాప్ సింగ్, ఎలెక్టోరోల్ సిబ్బంది, బీ.ఎల్.ఓ. లు పాల్గొన్నారు.

## బిజెపి మహిళల సంబరాలు

**మల్కాజిగిరి సెప్టెంబర్ 19 మనసాక్షి**



ప్రత్యేక పార్లమెంటు సమావేశాల్లో ప్రతిష్టాత్మకమైన 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశ పెట్టడాన్ని స్వాగతిస్తున్నమని వినాయక నగర్ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి తెలిపారు. ఈ మేరకు ఆమె బిజెపి కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా అధ్యక్షురాలు సుశీల,ఎస్సీ మోర్చా నేత చైతన్య, సీనియర్ మహిళ నాయకులు జయమ్మలతో కలిసి హైదరాబాద్ బిజెపి కార్యాలయంలో ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి అనంతరం టపాకాయలు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మహిళ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌ను గెలిపిద్దాం...
# సోనియమ్మ రుణం తీర్చు కుందాం..!

## ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జీ వడ్డేపల్లి సుభాష్ రెడ్డి.



**నాగిరెడ్డిపేట్ సెప్టెంబర్ 19, మన సాక్షి:-**

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటేసి గెలిపిద్దామని, తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియమ్మ రుణాన్ని తీర్చుకుందామని ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జీ వడ్డేపల్లి సుభాష్ రెడ్డి అన్నారు. ఆయన సోమవారం కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఏఐసీసీ సభ్యుడు మయప్పన్ హాజరైయ్యారు. సమావేశంలో సుభాష్ రెడ్డి మాట్లాడుతూ ఆదివారం తుక్కుగుడాలో జరిగిన కాంగ్రెస్ విజయభేరి సభలో ఏఐసీసీ అగ్ర నాయకులు సోనియాగాంధీ, రాహుల్ గాంధీలు ప్రకటించిన 6 కాంగ్రెస్ గ్యారంటీ స్కీముల గురించి ఆయన ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే మహాలక్ష్మీ, రైతు భరోసా, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, యువవికాసం, చేయుత లాంటి ఆరు ప్రత్యేక గ్యారంటీ పథకాలను అమలు చేయనున్నట్టు ఆయన ప్రజలకు వివరించారు. తెలంగాణ ప్రజలు కలలుగన్న బంగారు తెలంగాణ సాకారానికి కాంగ్రెస్ పార్టీకి ఓటేయాలని, కాంగ్రెస్ ను గెలిపించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో గత రెండుసార్లు జరిగిన ఎన్నికల్లో ప్రజలకు మోస పూరిత హామీలను ఇచ్చి కెసిఆర్ అధికారం చేజిక్కించుకున్నారని, ఇచ్చిన హామిలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారని విమర్శించారు.రానున్న ఎన్నికల్లో కేసిఆర్ కు గుణపాఠం చెప్పాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ప్రతి ఒక్కరు బలపరుస్తూ కాంగ్రేస్ ను గెలిపించి అధికారంలోకి తేవాలని కోరారు. కాంగ్రెస్ గ్యారంటి పథకాల కార్డులను ఆయన ప్రజలకు అందజేశారు. కాంగ్రేస్ గ్యారంటీ కార్డులను ఇంటింటికి పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యుడు, మయప్పన్ , మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధనుంజయ్,కిసాన్ సెల్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి, ఎల్లారెడ్డి టౌన్ ప్రెసిడెంట్ హఫీజ్ పటేల్, మండలం ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ సాయిలు,కాంగ్రెస్ నాయకులు,అఫ్రీదీ,దుర్గేష్,కార్యకర్తలు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనులకు వంట సామాగ్రి పంపిణీ

**కంగ్టి, సెప్టెంబర్ 19, మన సాక్షి :-**



సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం నూతన తడ్కల్ మండల పరిధిలోని ఘనపూర్ గ్రామ పరిధిలోని గిరిజనులకు ఊరికే మేరకు సర్పంచ్ లక్ష్మణ్, ఉప సర్పంచ్ సవిత రామ్ సింగ్, ఆధ్వర్యంలో సుమారు రూ.30 వేల వంట సామాగ్రి బాసన్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ.. మాకు వంట బాసన్లు సామాగ్రి అందించిన సర్పంచ్, ఉప సర్పంచ్ , గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సుదర్శన్ రావు పాటిల్, ఆకుల రామన్న, భోగి రవి, హన్మండ్లు, లాలయ్య, గంసీబాయి, లక్ష్మి బాయి,శునీత,శోభా,శంత బాయి, ఎస్టీ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీలో చేరిక

**రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు ప్రతినిధి సెప్టెంబర్ 19 మనసాక్షి:**



ఆమనగల్లు మున్సిపాలిటీలోని 5 6 11 14 వార్డుల నుండి ఇతర పార్టీ కార్యకర్తలు టిఆర్ఎస్ పార్టీలోకి ఆమనగల్లు మున్సిపాలిటీ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పత్య నాయక్ ఆధ్వర్యంలో చేరారు.బిఆర్ఎస్ పార్టీలో చేరిన వారికి స్థానిక ఎమ్మెల్యే గుర్క జైపాల్ యాదవ్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలు చేసిన ఘనత కేసిఆర్ కి దక్కుతుందన్నారు.బిఆర్ఎస్ పాలనతో గ్రామాలు అభివృద్ధి పథంలో నడుస్తున్నట్లు వెల్లడించారు.అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేసే ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ చుక్క నిరంజన్ గౌడ్, మైనార్టీ నాయకులు సయ్యద్ ఖలీల్,పార్టీ యూత్ అధ్యక్షులు వెంకటేష్, ఉపాధ్యక్షులు భాస్కర్, మార్కెట్ డైరెక్టర్లు,ప్రధాన కార్యదర్శి రమేష్,భీమయ్య, జంతుక అల్లాజీ,గణేష్, రాజు,పాల్గొన్నారు.

## జనసేన పార్టీ చందానగర్ అధ్యక్షులుగా అరుణ్

**శేరిలింగంపల్లి (19సెప్టెంబర్ )మన సాక్షి**




జనసేన పార్టీ చందానగర్ డివిజన్ అధ్యక్షులుగా బసవపత్రి అరుణ్ కుమార్ ని నియమించింది. గతంలో అరుణ్ కుమార్, చందానగర్ కేంద్రంగా అఖిలభారతీయ విద్యార్థి పరిషత్ లో 2010 నుండి 2014 వరకు విద్యార్థి నాయకుడిగా పని చేసారు. చందానగర్ లోని విద్యార్థి సమాజం కు నాయకత్వం వహిస్తూ అనేక సమస్యలకు పరిష్కారం చూపటం జరిగింది. ఆ తర్వాత జనసేన పార్టీలో సైనికుడిగా పార్టీ కోసం పనిచేస్తూ పలు సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్నారు.ఈ సంధర్భంగా అరుణ్ కుమార్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో చందానగర్ డివిజన్ అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించినందుకు జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాన్ కి కృతజ్ఞతలు తెలిపారు.



## నాడు విద్యార్థి.. నేడు ప్రధానోపాధ్యాయుడు.

**నేలకొండపల్లి , సెప్టెంబర్ 19 మన సాక్షి.**

ఒకప్పుడు ఆ పాఠశాల కు చెందిన విద్యార్థి నేడు అదే పాఠశాల కు ప్రధానోపాధ్యాయుడు గా విధుల్లో చేరాడు.. .వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండల కేంద్రం కు చెందిన గోపగాని రమేష్ స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6 వ తరగతి నుంచి 10 వ తరగతి వరకు 1983 వరకు విద్య నభ్యసించిన విద్యార్థి... కాగా నేలకొండపల్లి కి చెందిన పూర్వ విద్యార్థి... అదే ఉన్నత పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడుగా మంగళవారం విధుల్లో చేరారు. ప్రస్తుతం ఇక్కడ హెచ్ఎం గా పని చేస్తున్న లక్ష్మి, ఖమ్మం మామిళ్లగూడెం ఉన్నత పాఠశాల కు బదిలీ అయ్యారు. ఈ మేరకు ఖమ్మంలో హెచ్యంగా విధులు నిర్వహిస్తున్న గోపగాని రమేష్ నేలకొండపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడుగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ర విద్యారుల సంఘం నాయకులు జెరిపోతుల సత్యనారాయణ.ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు రత్నకుమార్, రమేష్ తదితరులు ఘనంగా సన్మానించారు.

## మోకాళ్ళ పై నిలబడి నిరసన

**నారాయణపేట టౌన్, సెప్టెంబర్ 19 మనసాక్షి:-**



తొమ్మిది రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించక పోవడంను నిరసిస్తూ మంగళవారం అంగన్ వాడి ఉద్యోగులు జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పార్క్ దగ్గర మోకాళ్ల పై నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భముగా సి.ఐ.టి యూ. జిల్లా కార్యదర్శి బలరామ్ మాట్లాడుతూ అంగన్వాడీ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం 26,000/- లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 70 వేల మంది ఉద్యోగులు తొమ్మిది రోజులు గా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం నిమ్మకూ నిరెథినట్లు గా వ్యవహారించడం దారుణమని విమర్శించారు. ప్రభుత్వం స్పందించే వరకు ఈ పోరాటం ఆగదని చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు సావిత్రి, శారద, చక్రవేణీ, సుజాత, రాణి, సువర్ణ, హారిక, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## నీలం శ్రీనిధి కి ప్రథమ బహుమతి

**మేడిపల్లి, సెప్టెంబర్. 19 (మన సాక్షి)**



వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉప్పల్ శిల్పారామం నిర్మలనిత్యనికేతన్ లో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా లిటిల్ ఫ్లవర్ హై స్కూల్ లో నాల్గవ తరగతి చదువుతున్న చిన్నారి నీలం శ్రీనిధి తన భరతనాట్య ప్రదర్శన తో ప్రేక్షకులను ఆకట్టుకుంది. కార్యక్రమానికి విచ్చేసిన వినాయక భక్తులు ప్రేక్షకుల ప్రశంసలు అందుకోగా నిర్వాహకులు ఆ చిన్నారి నాట్య ప్రదర్శనకు ప్రథమ బహుమతిని అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా పెద్దలు కళాభిమానులు కళా రంగంలో శ్రీనిధి ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆశీర్వదించారు.

## చంద్రబాబు అరెస్టు కు నిరసన

**మేడిపల్లి. సెప్టెంబర్ 19 (మన సాక్షి)**



ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పై అక్రమ కేసుల్లో పెట్టి ఆయన అరెస్టును ఖండిస్తూ నిరసన దీక్ష తలపెట్టిన తెలుగుదేశం పార్టీ పిర్జాదిగూడ అధ్యక్షులు కుతాడి నర్సింహ ను ఉదయం ఆరు గంటలకే ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. నాయకులను అరెస్టు చేసిన టిడిపి కార్యకర్తలు, అభిమానులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి చంద్రబాబు అరెస్టుకు ఖండిస్తూ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఆ ర్యాలిని పోలీసులు మధ్యలోనే భగ్నం చేసి స్వచ్ఛందంగా వచ్చిన పార్టీ అభిమానులను, మహిళలను మేడిపల్లి పోలీస్ స్టేషన్ కు తరలించడం జరిగింది. ఈ సందర్భంగా పీర్జాదిగూడ నగర అధ్యక్షుడు కూతాడి నర్సింహమాట్లాడుతూ చంద్రబాబు అక్రమ అరెస్టును ఖండిస్తూ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శాంతియుతంగా తలపెట్టిన నిరసన దీక్షను భగ్నం చేస్తూ పోలీసులు ముందస్తు అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామని అన్నారు. ఈచర్యలతో జగన్, కేసీఆర్ తెర వెనుక నాటకం ఆడుతున్నారని ప్రజలకు అర్థమవుతుందని,వచ్చే ఎన్నికల్లో ఈ రెండు రాష్ట్రాల ప్రభుత్వాలను ఒడగొట్టి ప్రజలు బుద్ధి చెప్తారని తెలియజేశారు. ఇ కార్యక్రమంలో సిఐటియూ పీర్జాదిగూడ నగర కార్యదర్శి ఎన్.సృజన, సన్నీ, శ్రావన్అనపూర్ణ కాలనీవాసులు శ్రీనివాస్ రావ్ తో పాటు సురేష్ బాబు, ఉషారాణి, వీరమణి, నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు

## వైద్యం కోసం వస్తూ...
## మార్గమధ్యలో కుప్పకూలిపోయాడు.
### గుండెపోటుతో మృతి చెందిన వ్యక్తి

**నేలకొండపల్లి సెప్టెంబర్ 19 మన సాక్షి**



వైద్యం కోసం వస్తూ... మార్గమధ్యలో గుండెపోటు తో మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కధనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ముదిగొండ మండలం లోని బాణాపురంతండా కు చెందిన భూక్యా కాల్యా (55) అనే వ్యక్తి నేలకొండపల్లి ప్రభుత్వ హస్పిటల్ లో వైద్యం కోసం మంగళవారం బయలుదేరారు. నేలకొండపల్లి వచ్చే సరికి పెట్రోల్ బంక్ దగ్గర కు రాగానే ఒక్క సారిగా కుప్పకూలిపోయాడు. అక్కడి ప్రజలు దగ్గరకు చేరుకుని హస్పిటల్ కు తరలించే ప్రయత్నం చేస్తుండుగా... అప్పటికే గుండెపోటుతో మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహం పై కుటుంబ సభ్యులు పడి రోధిస్తున్న తీరు అందరికీ కంట తడిపెట్టించింది.



## కవి వీరబాబు కు ఇంటర్నేషనల్ నంది అవార్డు.

**నేలకొండపల్లి సెప్టెంబర్ 19 మన సాక్షి.**

ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం లోని అనాసాగారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, కవి చిలకబత్తిని వీరబాబు ఇంటెర్నషనల్ నంది అవార్డు ను అందుకున్నారు. అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి సందర్భంగా హైద్రాబాద్ లో జరిగిన కార్యక్రమంలో కవి వీరబాబుకు అరుదైన గౌరవం దక్కింది. సాహిత్య రంగంలో విశిష్ట సేవలందించినందుకు గాను, ఆర్.కె. కళా సాంస్కృతిక పాండేషన్ గుర్తించి అంతర్జాతీయ నంది అవార్డు ను తెలంగాణ ఇరిగేషన్ చైర్మన్ డాక్టర్. సముద్రాల వేణుగోపాలచారి చేతుల మీదుగా అవార్డు ను అందుకున్నారు. ఈ సందర్భంగా వీరబాబు మాట్లాడారు.... తన సాహిత్యం తో ప్రజలను చైతన్యం చేసేందుకు చేసిన శ్రమ ను గురించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన -తనకు అంతర్జాతీయ స్థాయిలో అవార్డు అందుకోవటం చాలా సంతోషంగా ఉందని అన్నారు. అనంతరం గ్రామంలో ఘనంగా అభినందించారు.

## తూతూ మంత్రంగా తనిఖీలు

**మిర్యాలగూడ, సెప్టెంబర్ 19, మన సాక్షి :**



సివిల్ సప్లై అధికారులు నల్గొండ జిల్లా మిర్యాలగూడ నియోజకవర్గంలోని పెట్రోల్ బంకులలో నామమాత్రపు తనిఖీలు మంగళవారం నిర్వహించారు. పెట్రోల్ బంకులలో కనీస సౌకర్యాలు కూడా లేనప్పటికీ వారికి ఎలాంటి నోటీసులు ఇవ్వకపోవడంతో పాటు వారిపై ఎలాంటి చర్యలు కూడా తీసుకోలేదు.పెట్రోల్ బంకులలో వాహనాలకు ఉచితంగా హెయిర్ పెట్టాల్సి ఉన్నప్పటికీ పెట్టడం లేదు. అంతేకాకుండా మంచినీటి సౌకర్యం , మూత్రశాలల సౌకర్యం కూడా లేకుండా ఉన్నాయి. అయినా కూడా సివిల్ సప్లై అధికారులు తూతూ మంత్రంగా తనిఖీలు నిర్వహించినట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. పట్టణంలోని బంగారుగడ్డ ఐఓసీఎల్, దామరచర్ల మండల కేంద్రంలో ఉన్న పెట్రోల్ బంకులను సివిల్ సప్లై అధికారులు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సేల్స్, నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా సివిల్ సప్లై డిప్యూటీ తాసిల్దార్ జావేద్ మాట్లాడుతూ పెట్రోల్ బంకులను తప్పనిసరిగా మాలిక వసతులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం, ఎయిర్ మిషిన్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు.ఎలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రోజువారి పెట్రోల్ డీజిల్ అమ్మకాలపై రికార్డుల నిర్వహణ సక్రమంగా చేపట్టాలన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలను కచ్చితంగా పాటించాలని కోరారు.సివిల్ సప్లై కమిషనర్, డిసిఎస్ఓ ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టినట్టు తెలిపారు. ఈ తనిఖీల్లో ఐఓసీఎల్ సేల్స్ అధికార శైక్ మొగల్ వలి , సివిల్ సప్లై ఆర్ఐ సురేందర్ సింగ్ తదితరులు ఉన్నారు.

రేషన్ దుకాణాలు తెరిచి ఉంచకపోయినా చర్యలు శూన్యం :

రేషన్ దుకాణాలు మిర్యాలగూడ పట్టణంలో ఏ సమయంలో తెరుస్తున్నారో.? ఏ సమయంలో మూసివేస్తున్నారో..? కూడా తెలియని పరిస్థితి నెలకొన్నది. ప్రస్తుతం రేషన్ దుకాణాలలో ప్రతి ఒక్కరు ఈ కేవైసీ కోసం వేలిముద్రలు ఇవ్వాల్సి ఉంది. కాగా రేషన్ దుకాణాలు సరైన సమయంలో తెరవకపోవడం వల్ల ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. సివిల్ సప్లై అధికారులకు ఈ విషయం తెలిసినప్పటికీ చూసి చూడనట్లు వదిలేస్తున్నారని సమాచారం.

## గ్రామాల్లో వైద్య శిభిరాలు ఏర్పాటు చేయాలి.


**నేలకొండపల్లి సెప్టెంబర్ 19 మన సాక్షి.**

మండలంలో ప్రతీ ఇంటికి జ్వరపీడుతులు ఉన్నారని కాంగ్రెస్ సేవాదళ్ పాలేరు నియోజకవర్గ కన్వీనర్ బచ్చలకూరి నాగరాజు ఆరోపించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ హాస్పిటల్ రోగులను కలిసి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం వివిధ సమస్యలతో కూడిన వినతి ప్రతం ను అడిషనల్ డీయం అండాచ్చో సైదులు కు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు..... గ్రామాలలో జ్వరాలతో ప్రజలు అల్లాడుతుంటే ప్రభుత్వం పట్టించుకోవటం లేదని ఆరోపించారు. నేలకొండపల్లి ప్రభుత్వ హస్పిటల్ లో వైద్యులు లేక మెరుగైన వైద్య సేవలు అందటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీ గ్రామంలో వైద్య శిబిరం ను ఏర్పాటు చేసి, పారిశుధ్యం పై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజారోగ్యం పట్ల నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

అదే విధంగా హస్పిటల్ లో ఖాళీగా ఉన్న వైద్యులు. -సిబ్బంది పోసులను వెంటనే భరీ చేయాలని డిమాండ్ చేశారు. లేని.పక్షంలో ఆందోళన తీవ్రతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇఫ్టూ ఏరియా కార్యదర్శి పగిడికత్తుల రామదాసు, ఆమ్ ఆద్మీ పార్టీ పాలేరు ఇంచార్జీ పసుమర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వాడవాడలా గణేష్ ఉత్సవాలు





















Edited, Printed, Published and Owned by MALLE NAGI REDDY Printed at LAXMI PUBLICATIONS H.No. 28-891/9, Journalist Colony, Chinthapally X Road, Miryalagda, Dist: Nalgonda-508207, Telangana.and Published at H.no.. 28 - 891/9, Chinthapally Bypass X Road, Miryalagda, Dist: Nalgonda-508207, Telangana."Editor: MALLE NAGI REDDY. RNI NO. TELTEL/2022/83470. Cell: 9666924232. gmail Id: manasakshi.in@gmail.com.